సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
సోమవారం, 11.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 199
పేజీలు: 08 వెల: రూ. 5

## నేటి నుంచి 17 వరకు
# విద్యా వారోత్సవాలు
### ప్రారంభించనున్న సీఎం రేవంత్ 03



- విద్యాశాఖ 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'కు శ్రీకారం
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై సర్కార్ ఫోకస్
- ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా విద్యా వారోత్సవాలు
- విద్యార్థులకు అవార్డులు, ల్యాప్‌టాప్‌ల పంపిణీ

## బీజేపీ జెండా ఎగురవేస్తాం
### కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ 02


- 'జై శ్రీరాం.. జై తెలంగాణ' నినాదాలతో రాజకీయ మార్పు తేవాలని పిలుపు
- బెంగాల్ తర్వాత తెలంగాణే బీజేపీ తదుపరి టార్గెట్ అని వ్యాఖ్యలు
- అవినీతి, కుటుంబ రాజకీయాలను బూడిద చేస్తామని ఘాటు హెచ్చరిక
- పరేడ్ గ్రౌండ్ లో బండి మేనియా



## రాష్ట్రాల అభివృద్ధిపై వివక్ష చూపం
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి 03

- 'ఎన్నికల వరకే రాజకీయాలు చేస్తాం
- తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం చిత్తశుద్ధితో ఉంది
- త్వరలోనే రీజనల్ రింగ్ రోడ్ పనులు ప్రారంభం
- తెలంగాణకు భారీ నిధులు






## మోదీ వికాస్
# ఉత్సవ్
### తెలంగాణపై రూ. 9,377 కోట్ల వరాల జల్లు!

- మూడోసారి పీఎం తర్వాత తొలిసారి రాక
- రూ. 9,377 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- సైబరాబాద్ అభివృద్ధిపై ప్రధాని మోదీ ప్రశంసలు
- సీఎం రేవంత్ తో సరదా సంభాషణ
- తమతో కలిసి పని చేద్దామన్న ప్రధాని
- రెండు గంటల సమయం కావాలన్న సీఎం
- పరేడు గ్రౌండ్ లో పబ్లిక్ మీటింగ్
- బీజేపీ నేతల్లో ఉత్సాహం నింపిన ప్రధాని టూర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో**

దేశాభివృద్ధిలో సైబరాబాద్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. సైబరాబాద్ ప్రస్తుతం ఒక అతిపెద్ద ఉపాధి కేంద్రంగా ఎదిగిందని, ముఖ్యంగా సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో ఈ ప్రాంతం విశేషమైన సేవలందిస్తోందని పేర్కొన్నారు. అనేక భారీ ప్రాజెక్టులు ఇక్కడ పురుడు పోసుకోవడం గర్వకారణమని, ఇవన్నీ దేశ పురోగతికి బాటలు వేస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తొలిసారి తెలంగాణ పర్యటనకు మిగతా 02లో

# రెండు గంటలివ్వండి
### తెలంగాణ అభివృద్ధిపై చర్చిద్దాం

- ప్రధానమంత్రి మోడీకి సీఎం విజ్ఞప్తి
- వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణ భాగస్వామ్యం అవుతోంది
- కేంద్ర నిధుల కేటాయింపు, ప్రాజెక్టుల అనుమతుల విషయంలో వివక్షకు గురవుతున్నాం
- పీఎంవోలో 'సింగిల్ విండో టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేయండి
- జాతీయ ప్రాధాన్యత ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వండి
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మీది పెద్దమనస్సు అంటుంటారు
- తెలంగాణకు నిధులిచ్చి పెద్ద మనస్సు చాటండి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టుల ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు, జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సత్వర అనుమతులు లభించేలా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక 'సింగిల్ విండో టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేయాలని కోరారు. వికసిత్ భారత్ కోసం ప్రధాని మోడీ.. ఎంత వేగంగా పని చేస్తున్నారో.. అంత వేగంగా తెలంగాణలో పనులు జరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రెండో దశ మెట్రో రైల్ ప్రాజెక్టు, మూసీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సీటీ, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ మచిలీపట్నం పోర్టు కోసం హైవే.. పలు రైల్వే లైన్ వంటి అంశాలపై చర్చించేందుకు ప్రధాని మోదీ కేవలం 2 గంటల సమయం ఇవ్వాలని కోరారు. మిగతా 02లో



# విజయ్.. అనే నేను..
### ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం




- ఉప్పొంగిపోయిన తల్లిదండ్రులు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్ గాంధీ
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష
- అభిమానులు, కార్యకర్తలతో కిటకిటలాడిన నెహ్రూ స్టేడియం
- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్

04

'జోసెఫ్ విజయ్ అనే నేను.. చట్టబద్ధంగా ఏర్పడిన భారత రాజ్యాంగంపై నమ్మకం, విశ్వాసం కలిగి ఉంటానని, భారత సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని ప్రమాణం చేస్తున్నాను. తమిళనాడు ముఖ్యమంత్రిగా నా విధులను నిజాయితీగా, మనస్సాక్షికి లోబడి నిర్వహిస్తానని, రాజ్యాంగానికి, చట్టానికి అనుగుణంగా... భయం లేదా పక్షపాతం లేకుండా, రాగద్వేషాలకు అతీతంగా ప్రజలందరికీ న్యాయం చేస్తానని దైవ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.. ముఖ్యమంత్రిగా నా బాధ్యతల నిర్వహణలో భాగంగా నా దృష్టికి వచ్చిన ఏ విషయాన్నైనా, విధి నిర్వహణలో అవసరమైనప్పుడు తప్ప.. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎవరికీ వెల్లడించనని దేవుని సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను..'

## ఇదో నూతన
# ఆరంభం
### ప్రజాధనం వృథా చేయను.., ప్రజల సొమ్మును దోచుకోను

- ఆకలి కష్టాలు తెలిసిన వాడిని..
- అందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తా
- విజయ్ కేబినెట్ లో ఏడుగురు టీవీకే
- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చోటు
- తొలి మూడు సంతకాలు వీటిపైనే


04

జీవితంలో చాలా కష్టాలు అనుభవించానని.. ఆకలిబాధలు అంటే ఏంటో తనకు తెలుసని తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి విజయ్ అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తమిళగ వెట్టి కళగం (జీవీకే) అధినేత తొలిసారిగా సభను ఉద్దేశించి ప్రసంగించారు. తనను అభిమానంగా పిలిచారు రాజకీయాల్లోకి వచ్చానని ఈ సందర్భంగా వెల్లడించారు. నేను మీ కుటుంబ సభ్యుడి బాంటి వాడిని, సినిమాల్లో నన్ను ఉన్నతస్థాయిలో నిలిపాడు. తమ్ముడూ అంటూ పిలిచారు కాబట్టి రాజకీయాల్లోకి వచ్చాను. నా ప్రయాణంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా, ఇది మీ ప్రభుత్వం.. డ్రగ్స్ పై ఈరోజు నుండి పోరాటం ప్రారంభం' అని సీఎం విజయ్ అన్నారు.

# కొండగట్టు ముస్తాబు..
### నేటి నుంచి 13 వరకు హనుమాన్ జయంతి

- ప్రారంభమైన ఆంజనేయ స్వామి పెద్ద జయంతి ఉత్సవాలు
- వేద మంత్రోచ్చారణల మధ్య ఉత్సవాలకు శుభారంభం చేసిన ఆలయ అర్చకులు

03



## ఎన్‌హెచ్ 65 విస్తరణ త్వరగా చేపట్టండి



- ఎన్ హెచ్ఏఐ ఛైర్మన్ కు మంత్రి కోమటిరెడ్డి వినతి
- రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణంపై చర్చ

03






## పవన్ కు పరామర్శ
# చంద్రబాబుతో ప్రత్యేక భేటీ
### హైదరాబాద్ పర్యటనలో చంద్రబాబు నివాసానికి వెళ్లిన మోదీ

- 'మా కుటుంబానికి మధుర జ్ఞాపకం' అంటూ చంద్రబాబు భావోద్వేగ పోస్ట్
- పవన్‌తో ఏకాంత భేటీ.. ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశం
- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రధాని మద్దతుపై చంద్రబాబు కృతజ్ఞతలు

04

ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెర లేపింది. ప్రోటోకాల్‌కు అతీతంగా ప్రధాని మోదీ స్వయంగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి చేరుకున్న ప్రధానికి బాబు కుటుంబ సభ్యులు స్వాగతం పలి కారు. -ముద్ర డెస్క్ :



## ఫ్యాటీ లివర్ వ్యాధిని అడ్డుకోవాలంటే?



సమతుల్య ఆహారం తీసుకోండి: ఆహారంలో పండ్లు, ఆకుకూరలు మరియు పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోండి. చక్కెర, మైదా మరియు ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండటం కాలేయానికి చాలా మంచిది.

# మోదీ వికాస్ ఉత్సవం



(మొదటి పేజీ తరువాయి)

వచ్చారు. ఇటీవల ఎన్నికల ఫలితాలతో తొలి సారి పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ పాగా వేయడంతో బీజేపీ నేతలు హ్యాపీగా ఉన్నారు. దేశాభివృద్ధిలో సైబరాబాద్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. సైబరాబాద్ ప్రస్తుతం ఒక అతి పెద్ద ఉపాధి కేంద్రంగా ఎదిగిందని, ముఖ్యంగా సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో ఈ ప్రాంతం విశేషమైన సేవలందిస్తోందని పేర్కొన్నారు. అనేక భారీ ప్రాజెక్టులు ఇక్కడ పురుడు పోసుకోవడం గర్వకారణమని, ఇవన్నీ దేశ పురోగతికి బాటలు వేస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ మూడో సారి ప్రధానమంత్రి అయ్యాక తొలిసారి తెలంగాణ పర్యటనకు వచ్చారు. ఇటీవల ఎన్నికల ఫలితాలతో తొలిసారి పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ పాగా వేయడంతో బీజేపీ నేతలు హ్యాపీగా ఉన్నారు.

**తెలంగాణలో రూ. 9,377 కోట్ల అభివృద్ధి పనులు**

హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో సుమారు రూ. 9,377 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు ఆదివారం నాడు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వరంగల్‌లో ప్రారంభించిన పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కు దేశీయ జౌళి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని, దీని ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, దీనివల్ల తెలంగాణ ఎంతగానో లాభపడుతుందని ప్రధాని అన్నారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీని రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి సత్కరించారు. అనంతరం.. మోదీకి వెండి నంది విగ్రహాన్ని బహుకరించారు. ఇక.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శ్రీరాముడి ప్రతిమను మోదీకి బహూకరించారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశ్రామికాభివృద్ధి, రవాణా, ఆరోగ్య రంగాల పురోగతికి సంబంధించి సుమారు రూ.9,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం సహా మరికొన్ని ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిలో రూ.3,180 కోట్లతో చేపట్టే రహదారి పనులు, రూ.2,360 కోట్లతో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఉన్నాయి. రూ.610 కోట్లతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్‌కు శ్రీకారం చుట్టిన మోదీ.. రూ.1,243 కోట్లతో కాజీపేట–విజయవాడ ట్రిపులింగ్ పనులను ప్రారంభించారు. అనంతరం రూ. 1,700 కోట్లతో నిర్మించిన పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభత్సవంలో పాల్గొన్న ప్రధాని.. రూ.300 కోట్లతో నిర్మించిన రైలు అండర్ రైల్ బైపాస్ లైన్‌నూ ప్రారంభించారు. ప్రధాని ప్రారంభించిన ప్రాజెక్టుల్లో వరంగల్‌లో ప్రతిష్మాత్మకంగా ఏర్పాటుకానున్న పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్, జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంత విస్తరణ, హైదరాబాద్–పనాజీ ఆర్థిక కారిడార్‌కు సంబంధించిన జాతీయ రహదారి పనులు, మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ గ్రీన్‌ఫీల్డ్ టెర్మినల్, హైటెక్‌సిటీలో ఆధునిక క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వంటి కీలక ప్రాజెక్టులున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో రాష్ట్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, రహదారులు, ఆరోగ్య సేవల విస్తరణ ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ తెలిపారు..

**'మాతో కలవండి, కలిసి పనిచేద్దాం'.. సీఎంకు ప్రధాని విజ్ఞప్తి**

ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణపై పెద్ద మనసు చూపాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ప్రధాని.. మాతో కలవండి, కలిసి పనిచేద్దాం అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. గుజరాత్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినట్లు.. తెలంగాణకు కూడా ఇవ్వాలంటూ సీఎం రేవంత్ చేసిన విజ్ఞప్తిపై.. ప్రధాని మోదీ ఫన్నీగా స్పందిస్తూ.. తమతో కలవండి అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ .. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. రూ.9,400 కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. జహీరాబాద్ పారిశ్రామిక కారిడార్‌ను గ్లోబల్ హబ్‌గా.. వరంగల్ మిత్ర పార్కును వస్త్ర విప్లవానికి కేంద్రంగా నరేంద్ర మోదీ అభివర్ణించారు.

**గుజరాత్ కు ఇచ్చినట్టు ఇవ్వండి: సీఎం**

ఈ క్రమంలోనే అంతకుముందు ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి.. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి గుజరాత్ రాష్ట్రానికి ఏమేం నిధులు, ప్రాజెక్టులు కేటాయించారో.. అదే విధంగా తెలంగాణకు కూడా ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ప్రధాని మోదీ.. అలా చేస్తే.. ఇప్పుడు తెలంగాణకు వచ్చే వాటిలో సగమే వస్తాయని పేర్కొన్నారు. ఒకవేళ అలాగే కావాలంటే.. తెలంగాణ అనుకున్న స్థాయికి అభివృద్ధి చెందలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి నడిస్తేనే తెలంగాణ లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్న ప్రధాని మోదీ.. తమతో కలవాలని, కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. దీంతో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి సహా కేంద్ర మంత్రి బండి సంజయ్ నవ్వారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేయడమే మంచిదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ సూచించారు. గత 10 ఏళ్లలో గుజరాత్‌కు కేంద్ర ప్రభుత్వం ఏం ఇచ్చిందో.. అవన్నీ తెలంగాణకు ఇచ్చేందుకు తాను రెడీ అని ప్రకటించారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపిన రేవంత్ రెడ్డి.. అందుకోసం తెలంగాణ మోడల్‌ను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ గుజరాత్ మోడల్‌ను ఎలా అభివృద్ధి చేశారో.. ఇప్పుడు తెలంగాణపై కూడా అవే అంచనాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి పేర్కొనడంతో.. దానికి సమాధానంగా వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా వరంగల్‌లో ఏర్పాటు కానున్న పీఎం మిత్ర పార్క్.. దేశంలో సరికొత్త వస్త్ర విప్లవాన్ని తీసుకువస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత వస్త్ర పరిశ్రమ కీలక పాత్ర పోషించిందని.. తిరిగి ఆ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే బడ్జెట్ రూ. 1,000 కోట్ల లోపే ఉండేదని.. కానీ ఇప్పుడు ఒక్క తెలంగాణకే సుమారు రూ.5,500 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 50 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు జరుగుతున్నాయని వివరించారు. గత 11 ఏళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపు అయినట్లు గుర్తు చేశారు. సోలార్ పవర్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్న ప్రధాని.. ఇంధన భద్రత కోసం భారీగా పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు.

**పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఇళ్లకు ప్రధాని మోదీ..**

ప్రధాని మోదీ హైదరాబాద్‌లో పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి కార్యక్రమం పూర్తైన అనంతరం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లారు, జూబ్లీహిల్స్‌లోని పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లిన ప్రధాని మోదీ.. ఇటీవల సర్జరీ చేయించుకున్న పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సైనస్ సమస్య కారణంగా పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వచ్చిన ప్రధాని మోదీ.. జూబ్లీహిల్స్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మోదీని సాదరంగా ఆహ్వానించారు. ఆనంతరం 20 నిమిషాల పాటు పవన్ కళ్యాణ్ నివాసంలో మోదీ ఉన్నారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ప్రధాని మోదీ.. సరైన విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

**చంద్రబాబు ఇంటికి..**

మరోవైపు పవన్ కళ్యాణ్ ఇంటి నుంచి ప్రధాని మోదీ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రధానికి సీఎం చంద్రబాబు సాదర స్వాగతం పలికారు. అనంతరం వివిధ అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిసింది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రోటోకాల్ పక్కన బెట్టి మరీ.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇళ్లకు వెళ్లటం ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా ప్రధాని మోదీ ఇలాంటి అధికారిక కార్యక్రమాలకు వెళ్లినప్పుడు.. రాజకీయ నేతల ఇళ్లకు వెళ్లటం చాలా అరుదు. అయితే దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీ ప్రాబల్యాన్ని పెంచే వ్యూహంలో భాగంగానే మోదీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు నివాసాలకు వెళ్లినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్డీఏ కూటమిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని చాటి చెప్పే వ్యూహంలో భాగంగానే ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నివాసాలకు వెళ్లినట్లు విశ్లేషణలకు వస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో ఎన్డీఏ కూటమిని మరింత బలోపేతం చేసేందుకు, కొత్త భాగస్వామ్యులను ఆకర్షించే ప్రయత్నమనే విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తంగా హైదరాబాద్ పర్యటనకు వచ్చిన మోదీ.. ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం ఇళ్లకు వెళ్లటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

**2 గంటల సమయం ఇవ్వండి.. ప్రధాని మోదీకి సీఎం రిక్వెస్ట్**

దేశ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రధాని మోదీ.. కొంచెం తెలంగాణపై కూడా దృష్టి పెట్టాలని.. ఆయన ముందే సీఎం రేవంత్ రెడ్డి రిక్వెస్ట్ చేశారు. తెలంగాణ అభివృద్ధికి తాము చేస్తున్న ప్రయత్నానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు అయిపోయాయని.. అభివృద్ధే ఇప్పుడు ధ్యేయమని తేల్చి చెప్పారు. ప్రధాని మోదీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని.. కానీ తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఇది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. ఇది వికాస్ ఉత్సవం అని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్‌తో తాము కలిసి నడుస్తామని హామీ ఇచ్చారు. దేశంలో 5 రాష్ట్రాల ఎన్నికలు పూర్తి అయిపోయాయని.. ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదని.. అభివృద్ధి గురించే మాట్లాడదామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందని.. కానీ దేశ జీడీపీకి మాత్రం 5 శాతం వాటా ఇస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీది పెద్ద మనసు అని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చెబుతుంటారని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. తెలంగాణపై కూడా ఆ పెద్ద మనసు చూపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చెప్పిన సీఎం రేవంత్.. మోదీ దేశాన్ని అభివృద్ధి చేస్తున్నారు కానీ తెలంగాణకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని తెలిపారు. ఈ క్రమంలోనే భారతదేశ అభివృద్ధిలో 6 మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పిన సీఎం రేవంత్.. దేశ ఖజానాకు అధిక ఆదాయాన్ని ఇస్తున్న నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ నగరాల అభివృద్ధి, అనుమతుల కోసం ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో)లో స్పెషల్ టాస్క్ ఫోర్స్, సింగిల్ విండో విధానం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులను తాను అనేక సార్లు కలిశానని.. తాను కలిసిన పనుల్లో కొన్ని పనులు మాత్రమే అయ్యాయని.. మరికొన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వికసిత్ భారత్ కోసం ప్రధాని మోదీ ఎంత వేగంగా పని చేస్తున్నారో.. అంత వేగంగా తెలంగాణలో పనులు జరగడం లేదని కాస్త అసహనం వ్యక్తం చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రెండో దశ మెట్రో రైల్ ప్రాజెక్టు, మూసీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ,రేడియల్ రోడ్లు, హైదరాబాద్ మచిలీపట్నం పోర్టుకు హైవే.. పలు రైల్వే లైన్ వంటి అంశాలపై చర్చించేందుకు ప్రధాని మోదీ కేవలం 2 గంటల సమయం ఇవ్వాలని.. తమ ప్రతిపాదనలను అన్నింటినీ తాను ప్రధాని ముందు ఉంచుతానని తేల్చి చెప్పారు.

**చివరగా పరేడ్ గ్రౌండ్ లో సభ**

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, నేతల పరామర్శ అనంతరం ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఈ సభలో ఆయన తెలుగులో ప్రసంగం చేశారు. ఈ సభ సక్సెస్ కావడంతో బీజేపీ నేతల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

### ప్రధాని మోదీ ప్రారంభించిన ప్రాజెక్టులు ఇవే..

★జాతీయ రహదారి 167 విస్తరణలో భాగంగా గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు పనులు (3,175 కోట్ల రూపాయలు).
★21 కి.మీ. కాజీపేట రైల్ అండ్ రైల్ బైపాస్ రైల్వే లైను ( 292 కోట్ల రూపాయలు).
★118 కి.మీ. కాజీపేట–విజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టు ( 1,243 కోట్ల రూపాయలు
★హైదరాబాద్ సమీపంలోని మల్కాపూర్ వద్ద నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పీవోఎల్ (611 కోట్ల రూపాయలు).
★వరంగల్‌లోని 'పీఎం మిత్ర' కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (1,695.54 కోట్ల రూపాయలు).
★జహీరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ( 2,360.54 కోట్ల రూపాయలు).







# రెండు గంటలివ్వండి..



(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రతిపాదనలను అన్నింటినీ తాను ప్రధాని ముందు ఉంచుతానని వెల్లడించారు. ప్రధాని మోదీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. కానీ తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందని.. కానీ దేశ జీడీపీకి మాత్రం 5 శాతం వాటా ఇస్తోందని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణలో పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ హైదరాబాద్ హెచ్ఐసీసీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్రమంత్రులతో కలిసి పాల్గొన్న సీఎం తెలంగాణ అభివృద్ధిపై ప్రధానికి పలు విజ్ఞప్తులు చేశారు.

**పెద్ద మనస్సు చూపండి**

దేశ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రధాని మోడీ.. తెలంగాణలో అభివృద్ధిపైనా దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి తాము చేస్తున్న ప్రయత్నానికి కేంద్ర ప్రభుత్వం సహాయం అవసరమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ.. తెలంగాణపై పెద్ద మనసు చూపాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధిలో భాగంగా తెలంగాణ అభివృద్ధికీ సహకరించాలని కోరారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయాయని.. ఇప్పుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందనీ అందులో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని తాము టార్గెట్ పెట్టుకున్నామని సీఎం చెప్పారు. తెలంగాణను నంబర్ వన్ చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. వీటిని సాధించేందుకు తెలంగాణను అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం కావాలని విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్... కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. ఇది వికాస్ ఉత్సవం అన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్‌తో తాము కలిసి నడుస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీది పెద్ద మనసు అని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చెబుతుంటారని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. తెలంగాణపై కూడా ఆ పెద్ద మనసు చూపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చెప్పిన సీఎం రేవంత్.. మోదీ దేశాన్ని అభివృద్ధి చేస్తున్నారు కానీ తెలంగాణకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని తెలిపారు. దేశ అభివృద్ధిలో ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం చెప్పారు. దేశ ఖజానాకు అధిక ఆదాయాన్ని ఇస్తున్న నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ నగరాల అభివృద్ధి, అనుమతుల కోసం ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో)లో స్పెషల్ టాస్క్ ఫోర్స్, సింగిల్ విండో విధానం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులను తాను అనేక సార్లు కలిశానని.. తాను కలిసిన పనుల్లో కొన్ని పనులు మాత్రమే అయ్యాయని.. మరికొన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# బీజేపీ జెండా ఎగరేస్తాం

**ముద్ర, కరీంనగర్ :**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "జై శ్రీరామ్, జై తెలంగాణ" నినాదాలతో తెలంగాణలో రాజకీయ మార్పు తీసుకురావాలని కార్యకర్తలకు ఏర్పాటు. బెంగాల్‌లో జై శ్రీరామ్ నినాదాలతో అరాచకాలకు ముగింపు పలికామని, ఇప్పుడు తెలంగాణే బీజేపీ తదుపరి లక్ష్యమని పేర్కొంది. బెంగాల్ విజయంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల్లో వణుకు మొదలైందని, ఆ రెండు పార్టీల పునాదులు కదులుతున్నాయని.

ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి తెలంగాణకు భారీగా నిధులు తీసుకొస్తుంటే, సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సొమ్మును ఢిల్లీకి పంపిస్తున్నారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రయోజనం చేకూర్చడంలో విఫలమైంది.

**పరేడ్ గ్రౌండ్ లో బండి సంజయ్ మేనియా**

పరేడ్ గ్రౌండ్ లో ఇద్దరు నేతలు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. ఒకరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాగా.. ఇంకొకరు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్ కు రాకకు 45 నిమిషాల ముందే బండి సంజయ్ పరేడ్ గ్రౌండ్ కు విచ్చేశారు. అప్పటికే పరేడ్ మైదానమంతా పూర్తిగా జన సంద్రమైంది. వేదికపై మహామహులంతా ఉన్నారు. బండి సంజయ్ సభా వేదికపై రాగానే ఒక్కసారిగా సభలోని వేలాది మంది కార్యకర్తల్లో ఒక్కసారిగా జోష్ నెలకొంది. ఈలలు, కేరింతలు, చప్పట్లతో విజిల్స్ వేస్తూ జై మోదీ.. జై బండి అంటూ నినదాలు చేయడంలో పరేడ్ మైదానమంతా మారుమోగిపోయింది. ఇక బండి సంజయ్ ప్రసంగం సైతం కార్యకర్తలను ఆకట్టుకుంది. జై శ్రీరాం నినాదంవల్ల తెలంగాణకు డబ్బులు రావడమే కాదు, కాంగ్రెస్, బీఆర్ఎస్ గుండెల్లో రాళ్లు పడుతున్నాయంటూ చేసిన వ్యాఖ్యలతో పరేడ్ మైదానం మరోసారి దద్దరిల్లింది. నేను ఏనాడు బీజేపీకి తలవంపులు తేను... మీ తాటాకు చప్పళ్లకు భయపడేటోడిని కాదు. భయపెడితే భయపడటానికి మీ ఫాంహౌజ్ లో ఎలుకను కాదు.. అయ్యపేరు చెప్పి, ఆస్తులకు కూడగట్టుకునేటోడిని కాదు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 11.05.2026
www.mudranews.in | @mudranews



## ఫ్యాటీ లివర్ వ్యాధిని అడ్డుకోవాలంటే?



బరువును నియంత్రించండి: అధిక బరువు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడానికి ప్రధాన కారణం. క్రమబద్ధంగా బరువు తగ్గడం ద్వారా కాలేయంలోని కొవ్వును గణనీయంగా తగ్గించుకోవచ్చు.

## పోలీసుల అదుపులో నలుగురు మావోయిస్టులు




**ముద్ర, తాండూరు ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలోని పెద్దేముల్ మండలం రుక్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో తలదాచుకున్న నలుగురు అనుమానిత మావోయిస్టులను తాండూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు పురుషులు, ఒక మహిళా మావోయిస్టు గత పది రోజులుగా కూలి పనులు చేసుకుంటూ అక్కడే నివసిస్తున్నట్లు సమాచారం. స్థానికుల సమాచారంతో మహారాష్ట్ర పోలీసుల సమన్వయంతో తాండూర్ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పాత హెడ్ క్వార్టర్స్ వద్ద దాడులు నిర్వహించి వారిని పట్టుకున్నారు. వీరిపై ఇప్పటికే మహారాష్ట్రలో కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. త్వరితగతిన ఆపరేషన్ నిర్వహించిన తాండూర్ పోలీస్ బృందాన్ని రాష్ట్ర పోలీస్ శాఖ అభినందించింది.

## జూన్ 2లోపు ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

### టీఆర్ఎస్ చీఫ్ కవిత



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు జూన్ 2 వరకు గడువు ఇస్తున్నట్లు టీఆర్ఎస్ చీఫ్ కవిత ప్రకటించారు. అప్పటికీ హామీలు అమలు చేయకుంటే ఉద్యమకారులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జార్ఖండ్ ప్రభుత్వం ఉద్యమకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాల తరహాలో తెలంగాణలో ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆదివారం జూబ్లీహిల్స్ లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆమె తెలంగాణ ఉద్యమకారుల సంఘాలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లకు మద్దతు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భువనగిరి జిల్లా కేంద్రంలో సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. భూపోరాటాలు ఉధృతం చేయాలనీ జిల్లాల వారీగా ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశం అనంతరం ఉద్యమకారులతో కలిసి ఆమె సహపంక్తి భోజనం చేశారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు రూప్ సింగ్, సయ్యద్ ఇస్మాయిల్, మలి దశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మూల ప్రభాకర్ గౌడ్, కార్యదర్శులు వెలమల రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షులు బోగి పద్మ, నాయకులు గుస్సా రవీందర్, అరుణ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు పూస శ్రీనివాస్, కొడిమల కృష్ణ, డీఎస్ మాణిక్యమ్మ, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు రామగిరి ప్రకాశ్, ఉపాధ్యక్షులు బీరకాయల మధుసూదన్, భరత్ రెడ్డి, తొలి దశ ఉద్యమకారుల సంఘం ఉపాధ్యక్షులు సాజిద సికిందర్, శ్రీవల్లి, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ కె. సత్యనారాయణ పాల్గొన్నారు.


## కావాలనే నా పేరు వాడుకుంటున్నారు

### నాపై అసత్య ప్రచారాలపై చర్యలు తీసుకోండి
### సైబర్ క్రైమ్ పోలీసులకు
### ఎమ్మెల్యే రాజాసింగ్ ఫిర్యాదు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ మండిపడ్డారు. తన పేరును వాడుకుంటూ నకిలీ ఖాతాల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆయన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ వంటి వేదికల్లో నకిలీ ఖాతాల ద్వారా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు, కల్పిత వార్తలు పోస్టు చేస్తున్నట్లు ఆయన గుర్తించారు. తప్పుడు ఐడీతో పోస్టులు చేస్తున్న ఫేస్ బుక్ ఐడీలను తన ఫిర్యాదులో పేర్కొంటూ ఇలాంటి చర్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రజలకు తన సోషల్ మీడియా ఖాతాలపై క్లారిటీ ఇచ్చారు. తనకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో ఎటువంటి అధికారిక ఖాతాలు లేవని స్పష్టం చేశారు. తాను కేవలం ఎక్స్ (ట్విట్టర్) లోని తన వెరిఫైడ్ హ్యాండిల్ @TigerRajaSingh ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటానని తెలిపారు. తన ఎక్స్ ఖాతాలో లేని ఏ సమాచారాన్ని కూడా ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. ఒక ప్రజా ప్రతినిధి ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న అసాంఘిక శక్తులను గుర్తించి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏసీపీ సైబర్ క్రైమ్‌ను ఆయన కోరారు. ఆ నకిలీ పేజీలను తక్షణమే బ్లాక్ చేయాలని విన్నవించారు. నిర్ధారణ లేని వార్తలను తన పేరుతో ప్రచారం చేసే సంస్థలపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేటి నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం “ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా నేటి నుండి ఈ నెల 17 వరకు “విద్యా వారోత్సవాల ను విద్యా శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ (క్యూర్) ప్రాంతంలోని పాఠశాలల్లో చేపట్టనున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం నేడు సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం హాజరై అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. వివిధ ప్రదర్శన స్టాళ్లను సందర్శించనున్నారు. పాఠశాల బ్యాండ్లు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాల మార్చ్‌పాస్ట్ ఆకట్టుకోనుంది. ప్రభుత్వ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, లక్ష్యాలపై సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులు సభలో ప్రసంగిస్తారు.ఈ సందర్భంగా సీఎం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మౌలిక వసతుల బలోపేతంపై ప్రభుత్వ దిశానిర్దేశాన్ని వెల్లడించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేయనున్నారు. అలాగే ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించిన కేజీబీవీ యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేయనున్నారు.

# హనుమాన్ జయంతికి కొండగట్టు ముస్తాబు

**ప్రారంభమైన ఆంజనేయ స్వామి పెద్ద జయంతి ఉత్సవాలు**
**నేటి నుంచి 13 వరకు నిర్వహణ ఏర్పాట్లు**
**వేద మంత్రోచ్ఛారణల మధ్య ఉత్సవాలకు శుభారంభం చేసిన ఆలయ అర్చకులు**





**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పెద్ద హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో గల శ్రీ కొండగట్టులో ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి పెద్ద జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమైనాయి. ఈ మేరకు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఉత్సవాలకు ఆలయ అర్చకులు శుభారంభం చేశారు. ప్రతిఏటా వైశాఖ బహుళ పూర్వబాద్ర నక్షత్రం రోజున జరుగుతున్న పెద్ద హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా నేటి నుంచి 13వ తేది వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పెద్ద హనుమాన్ జయంతి వేడుకలకు కొండగట్టు పరిసరాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం నుంచి స్వామి వారికి శేష వస్త్రాలు, అక్షింతలు కొండగట్టుకు చేరుకోగా, అలాగే ప్రభుత్వం తరపున చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం స్వామి వారికి పట్టు వస్త్రాలు తీసుకొని రాగా కొండగట్టు వై జంక్షన్ నుంచి డప్పు చప్పుల మధ్య ఆలయం వరకు ఊరేగింపుగా కళాబృందాల నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. కొండగట్టుకు వచ్చే అంజన్న దీక్షా స్వాములకు ప్రత్యేక ఏర్పాట్లుతోపాటు భక్తుల కోసం ఆలయంలో తడికల పందిళ్లు, క్యూ లైన్లు, 9 ప్రత్యేక ప్రసాద కౌంటర్లు, 6 లక్షల లడ్డూలు సిద్ధం చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే తాత్కాలిక మరుగుదొడ్లు, బోజ్జా పోతన్న గుడి సమీపంలో వాహన పార్కింగ్ వసతి కల్పించారు. అలాగే కొండగట్టులో జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా పోలీసులు బారీ భద్రతా చర్యలు చేపట్టారు.

# రాష్ట్రాల అభివృద్ధిపై వివక్ష చూపం



**ఎన్నికల వరకే రాజకీయాలు**
**త్వరలోనే రీజనల్ రింగ్ రోడ్ పనులు ప్రారంభం**
**తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం చిత్తశుద్ధితో ఉంది**
**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ అభివృద్ధిపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాల్లో కమ్యూనిస్ట్, కాంగ్రెస్, డీఎంకే ఏ ప్రభుత్వం ఉన్నా ఎలాంటి వివక్ష లేకుండా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తెలంగాణలో ఏకకాలంలో 42 రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరగనుందని వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులు ఎయిర్ పోర్టు మాదిరిగా జరుగుతున్నాయన్నారు. ఆదివారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హెచ్ఐసీసీలో రూ.9,500 కోట్ల అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోడీ నేతృత్వంలో వికసిత్ భారత్ లక్ష్యాలను అందుకోనున్నామని తెలిపారు. త్వరలోనే తెలంగాణలో రీజనల్ రింగ్ రోడ్ పనులు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. మూడేళ్ల క్రితమే రీజినల్ రింగ్ రోడ్డు పనులకు కేంద్రం అంగీకరించిందని చెప్పారు. కేంద్ర కేబినెట్ ఆమోదం తర్వాత పనులు వేగవంతంగా పూర్తవుతాయన్నారు. మోడీ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు. 2014 కు ముందు తెలంగాణలో 2400 జాతీయ రహదారులు ఉంటే ఈ 11 ఏళ్లలో సుమారు 2600 జాతీయ రహదారులు పెరిగాయన్నారు. కేంద్రం పెద్ద ఎత్తున జాతీయ రహదారులపై ఖర్చు చేస్తోందన్నారు. అలాగే రైల్వే నెట్వర్క్ తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సుమారు 42 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలో ప్రధాని మోడీ తెలంగాణ పర్యటనల్లో అప్పటి సీఎం హాజరుకాలేదని గుర్తు చేశారు.

### తెలంగాణ అభివృద్ధికి రూ. 12 లక్షల కోట్లు ఇచ్చాం
#### బహిరంగ సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కేంద్రంలోని మోడీ సర్కార్ గడిచిన పదకొండేళ్లలో తెలంగాణ అభివృద్ధికి రూ. 12 లక్షల కోట్లను కేటాయించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం రూ. 1.85 లక్షల కోట్లు ఇచ్చామన్న ఆయన ఐదు వందేభారత్ రైళ్లు, 42 రైల్వేస్టేషన్ల అభివృద్ధి, మూడు బుల్లెట్ రైళ్లు కూడా తెలంగాణకు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సన్న బియ్యం పథకానికి కేంద్రమే 80 శాతం నిధులు ఇస్తోందని స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పదేళ్లు కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయిన తెలంగాణ, ఇప్పుడు గాంధీ కుటుంబం చేతిలో చిక్కుకు పోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కేవలం ముస్లింల కోసమే పనిచేస్తున్నారని ఆరోపిం చారు. ఓట్ల కోసం కాంగ్రెస్ మత రాజకీయాలకు తెరలేపిందని మండి పడ్డారు. ఓటర్ల సవరణ ప్రక్రియ పేరుతో ప్రభుత్వం ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని మండిపడ్డారు. అబద్ధపు గ్యారంటీలతో ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ కు అలవాటని, తాము మాట తప్పం కాబట్టే కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. దేశంలోని 21 రాష్ట్రాల్లో బీజేపీ కూటమి అధికారంలో ఉండటమే తమ పనితీరుకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో తెలంగాణలో ఎనిమిది ఎంపీ సీట్లు గెలిచామని ఈసారి ఆ విజయపరంపర మరింత కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ విముక్తి చెందాలంటే అది కేవలం 'మోదీ గ్యారంటీ'తోనే సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఎన్నికల ముందు అమలుకు నోచుకోని హామీలు, వాగ్దానాలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు.

# ఎన్ హెచ్ 65 విస్తరణ త్వరగా చేపట్టండి

**ఎన్ హెచ్ఏఐ చైర్మన్ కు మంత్రి కోమటిరెడ్డి వినతి**
**రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణంపై చర్చ**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** నిత్యం ప్రమాదాలతో మృత్యు మార్గాలుగా పిలువబడుతున్న హైదరాబాద్ – విజయవాడ రహదారి ఎనిమిది లేన్ల విస్తరణ పనులు వీలైనంత త్వరగా చేపట్టాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ ఏ ఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ ను కోరారు. ఇదే రహదారిలో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు నాగపూర్ తరహాలో 7.1కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్న మంత్రి దానికి సంబంధించిన డిపీఆర్ను కేంద్ర రోడ్డు, రవాణా రహదారుల మంత్రిత్వ శాఖకు పంపిన విషయాన్ని ప్రస్తావించారు. ఆదివారం హైదరాబాద్కు విచ్చేసిన సంతోష్ కుమార్ యాదవ్ తో మంత్రి భేటీ అయ్యారు. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ – విజయవాడ(ఎన్ హెచ్ 65) విస్తరణ పనులు ప్రారంభం పై ప్రత్యేకంగా చర్చించారు. హైదరాబాద్ – విజయవాడ, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అతి త్వరలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్ హెచ్ ఏ ఐ చైర్మన్ మంత్రికి వివరించారు. రాష్ట్రంలో ఎన్ హెచ్ ఏ ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, చేపట్టనున్న పలు ప్రాజెక్టుల అంశాలు చైర్మన్ దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామ్యంగా నిలిచే ప్రాజెక్టులు త్వరగా పూర్తయేలా చూడాలని మంత్రి కోరారు. మంత్రి వెంట రోడ్లు భవనాలు శాఖ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,ప్రత్యేక కార్యదర్శి ప్రావిణ్య, ఎన్ హెచ్ ఏ ఐ రీజినల్ ఆఫీసర్ శివ శంకర్,ఆర్ అండ్ బి సి.ఈ లు ధర్మారెడ్డి,రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

## బైకులు ఢీ - ఇద్దరు మృతి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో ఆదివారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం, చిన్నకంజర్ల గ్రామానికి చెందిన యటకాని నర్సింగరావు(29) మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం, లింగాపూర్ గ్రామానికి చెందిన పిల్లి భవానితో సంవత్సరం క్రితం వివాహం జరిగింది. గత నెల వారికి పాప పుట్టగా పాపను చూసేందుకు తన బైక్ పై లింగాపూర్ వెళుతుండగా నర్సాపూర్ శివారులో ఆనంద్ గార్డెన్ సమీపంలో నర్సాపూర్ నుంచి దౌల్తాబాద్ వైపు వేగంగా వస్తున్న మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం వెంకట్రావుపేటకు చెందిన కోడిగండ్ల దిలీప్(18) బైకు, నర్సింగ రావు బైకును ఢీ కొట్టగా నర్సింగరావు అక్కడికక్కడే మృతి చెందగా, దిలీప్ ఆసుపత్రిలో మృతి చెందారు. బైక్ వెనకాల కూర్చున్న మనోహర్ కు గాయాలయ్యాయి. అదే సమయంలో నర్సాపూర్ వైపు నుంచి దౌల్తాబాద్ వైపు వస్తున్న ఆటో బైకులను ఢీకొట్టి అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్ళి పార్కింగ్ చేసిన డీసీఎంను ఢీకొంది. ఆటోలో ఉన్న గుమ్మడి అశోక్, నీరుడి కవిత, రమేశ్ కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు

**పాఠశాల విద్యలో ఇంటర్ విలీనంపై సీఎం సమీక్ష**
**శాసనసభలో చర్చ తర్వాతే తుది నిర్ణయం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** త్వరలో ప్రారంభంకానున్న విద్యా సంవత్సరంలో యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఇంటర్మీడియట్ ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని, ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఇంటర్‌లో చేరడం లేదు. ఈ నేపథ్యంలో 11, 12 తరగతులుగా కొనసాగించాలని సీఎం సూచించారు. తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణాలతో సీఎం చర్చించారు. విలీనంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తనకు నివేదిక సమర్పించాలని సీఎం సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 11.05.2026
www.mudranews.in | @mudranews



### ఫ్యాటీ లివర్ వ్యాధిని అడ్డుకోవాలంటే?

క్రమం తప్పకుండా వ్యాయామం: రోజుకు కనీసం 30 నిమిషాల పాటు నడక లేదా యోగా వంటి వ్యాయామాలు చేయండి. ఇది శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగు పరిచి, కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.



# ఈ అమ్మకు త్యాగమే జీవితం?

మన దేశంలో "అమ్మ" అనే పదాన్ని అపారమైన గౌరవంతో పలుకుతారు. "అమ్మ త్యాగమూర్తి", "మాతృదేవోభవ" వంటి భావనలు తరతరాలుగా వినిపిస్తూనే ఉన్నాయి. బయటకు చూస్తే ఇవి స్త్రీని గౌరవిస్తున్నట్టుగా కనిపిస్తాయి. కానీ లోతుగా పరిశీలిస్తే, ఈ భావజాలం స్త్రీ వ్యక్తిత్వాన్ని ఒక నిర్దిష్ట పాత్రలో బంధించినట్టుగానూ కనిపిస్తుంది. "స్త్రీకి ప్రాణం కన్నా గొప్పది శీలం" అన్న వాక్యం ఎలా ఆమె స్వేచ్ఛను నియంత్రించడానికి ఉపయోగించబడిందో, "అమ్మ అంటే త్యాగం" అనే భావన కూడా ఆమె జీవితాన్ని కుటుంబం, కులం, భర్త, పిల్లల కోసం పూర్తిగా అంకితం చేయాల్సిన బాధ్యతగా మార్చింది. సమాజం స్త్రీని ఒక "తల్లి"గా చూసినప్పుడే గౌరవిస్తుంది. కానీ ఆ తల్లి హోదా పొందాలంటే ఆమె శరీరంపై ఆమెకు పూర్తి అధికారం ఉండ కూడదనే నిర్మాణం ఈ సమాజంలో బలంగా పనిచేసింది. బ్రాహ్మణీయ పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ ఒక "కుల పరిరక్షణ యంత్రం"గా మారింది. ఆమె కనే సంతానం కుల స్వచ్ఛతను కాపాడాలని భావించి, ఆమె లైంగికతను "శీలం" అనే కంచెతో బంధించారు. బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధాప్యంలో కుమారుడు అనే నియంత్రణ వలయంలో "అమ్మ" కూడా బంధించబడింది. అనేక సందర్భాల్లో అమ్మకు ఇచ్చే గౌరవం ఆమె వ్యక్తిత్వాన్ని గుర్తించడం కన్నా, కుటుంబ-కుల వారసత్వంతో పాటు మత పరిరక్షణ పాత్రతో కూడా ముడిపడి ఉంటుంది. ఆ కంచె దాటితే ఆమెను "మంచి తల్లి కాదు", "శీలహీనురాలు", "కుటుంబ విలువలు లేని స్త్రీ"గా ముద్ర వేస్తారు. ఇది గౌరవం కాదు; శరీరాధికారాన్ని, స్వేచ్ఛను నియంత్రించే సామాజిక-రాజకీయ యంత్రాంగం.

"అమ్మ అంటే త్యాగం" అనే మాట కూడా ఆమెపై మోపబడిన ఒక మానసిక ఒత్తిడిగానే పనిచేసింది. ఆకలి వేసినా పిల్లలకే పెట్టాలి, తనకన్నా కుటుంబాన్ని ముందుంచాలి, ఎంత కష్టమొచ్చినా భర్త నీడలోనే బతకాలి, తనకంటూ స్వంత కోరికలు ఉండకూడదు, ఇవే ఒక "ఆదర్శ మాతృత్వానికి" కొలమానాలుగా నిర్మించబడ్డాయి. మనుస్మృతి వంటి బ్రాహ్మణీయ పితృస్వామ్య గ్రంథాలు స్త్రీని "రక్షణ" పేరుతో బంధీని చేశాయి. తల్లిగా ఆమె పడే కష్టాన్ని "మహిమ"గా చిత్రిస్తూ, ఆమెకు అందాల్సిన విశ్రాంతి, గౌరవం, హక్కులను సమాజం తెలివిగా ఎగ్గొట్టింది. ఈ నియంత్రణకు చరిత్రలో ఎన్నో రూపాలు ఉన్నాయి. సతి సహగమనం పేరుతో భర్త చనిపోతే భార్యను కూడా అతని చితిపై కాల్చివేయడం "పతివ్రత మహిమ"గా చెప్పబడింది. వితంతువులను బ్రతికున్న శవాల్లా గుండు గీయించి, తెల్లబట్ట కట్టించి, పునర్వివాహం నిషేధించి, సామాజికంగా వెలివేశారు. ఈ ఆచారాల అసలు లక్ష్యం స్త్రీ జీవితాన్ని నియంత్రించడమే. కుల-మత ఆధిపత్య నిర్మాణాలు నిలవాలంటే అంతర్వివాహ నియంత్రణ కొనసాగాలి; ఆస్తి "సరైన కులానికి" చెందిన వారికే వెళ్లాలి. ఈ విషయాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ "కుల నిర్మూలన"లో లోతుగా వివరించారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి విప్లవకారులు ఈ నిర్మాణాలను ప్రత్యక్షంగా సవాలు చేశారు. సమాజం చేత వెలివేయబడిన వితంతువుల మాతృత్వాన్ని వారు గౌరవించారు. గర్భవతులైన వితంతువుల కోసం "బాలహత్యా ప్రతిబంధక గృహం" స్థాపించి, అనాథలైన పిల్లలను అక్కున చేర్చుకుని సావిత్రిబాయి నిజమైన అమ్మగా నిలిచారు. ఒక స్త్రీ తల్లి కావాలా వద్దా, ఆమె సంతానం ఎవరనేది ఆమె స్వయం నిర్ణయాధికారం కావాలని వారు ఆనాడే చాటి చెప్పారు.

ఇప్పటికీ మన దేశంలో ద్వంద్వ ప్రమాణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒక పురుషుడు ఎన్నో సంబంధాలు పెట్టుకున్నా అతని "శీలం" గురించి పెద్దగా చర్చ ఉండదు. కానీ స్త్రీపై చిన్న అనుమానం వచ్చినా ఆమె జీవితానికే నైతిక తీర్పు ఇస్తారు. అత్యాచారం జరిగినా ప్రశ్నించేది బాధితురాలినే. ఆమె దుస్తులు, ప్రవర్తన, సమయం, వ్యక్తిగత జీవితం అన్నీ విచారణకు వస్తాయి. చట్టంలోని సాంకేతిక నిర్వచనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి, బాధితురాలు అనుభవించిన మానసిక-శారీరక హింసను పక్కన పెట్టే ధోరణి కొనసాగుతోంది. మరోవైపు మహిళా దినోత్సవాలు, మదర్స్ డే వంటి సందర్భాల్లో అమ్మను గొప్పగా కీర్తిస్తూనే, ఆమె చేసే గృహ శ్రమను మాత్రం శ్రమగానే గుర్తించరు. కుటుంబం కోసం తన జీవితాన్ని త్యాగం చేయడాన్నే ఆమె గొప్పతనంగా చూపిస్తారు. కానీ ఎందుకు ఒక అమ్మకు తన శరీరంపై పూర్తి హక్కు ఉండకూడదు? ఎందుకు ఆమెకు తన జీవితం గురించి స్వతంత్ర నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఇవ్వరు? ఎందుకు "మంచి తల్లి" అనే పేరుతో ఆమె వ్యక్తిత్వాన్ని అణచివేస్తారు? ఆస్తి వారసత్వం, కుల స్వచ్ఛత ఆమె మాతృత్వం మీదనే ఆధారపడి ఉంటాయి. అందుకే ఆమెను స్వేచ్ఛా ప్రపంచానికి దూరం చేసి, కుటుంబం అనే నాలుగు గోడల మధ్య "తల్లి"గా బంధించారు. త్యాగం, కుటుంబ గౌరవం పేర్లతో ఆమె జీవితాన్ని నియంత్రించారు. ఇవన్నీ కేవలం కుటుంబ సమస్యలు కాదు; కుల-పితృస్వామ్య సమాజం నిర్మించిన రాజకీయ నియంత్రణలు.

అందుకే ఈ మదర్స్ డే సందర్భంలో "అమ్మ"ను కేవలం త్యాగానికి ప్రతీకగా కాకుండా, ఒక సంపూర్ణ మనిషిగా చూడాల్సిన అవసరం ఉంది. ఆమెకు గొప్పది కేవలం మాతృత్వం కాదు; శరీరాధికారం, స్వేచ్ఛ, స్వాభిమానం, స్వయం నిర్ణయ హక్కు. ఒక అమ్మ తన జీవితాన్ని తాను నిర్ణయించుకునే హక్కు కలిగి ఉండాలి. ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి. ఇంటి పనిని కేవలం "తల్లి ప్రేమ"గా కాకుండా, గుర్తించబడని శ్రమగా సమాజం గుర్తించాలి. కుల పట్టింపుల కోసం పిల్లల ఇష్టాలను, స్త్రీ స్వేచ్ఛను బలి చేసే పరిస్థితి నుంచి సమాజం బయటకు రావాలి. మదర్స్ డే రోజున అమ్మకు పాదాభివందనం చేసి, మిగతా రోజుల్లో ఆమెను వంటింటికే పరిమితం చేయడం నాగరికత కాదు. ఆమెను దేవతగా పూజించడం కన్నా, మనిషిగా గుర్తించడమే నిజమైన గౌరవం. "స్త్రీకి ప్రాణం కన్నా గొప్పది శీలం" అనే వాక్యం ఎలా ఒక మోసపూరిత నిర్మాణమో, "అమ్మ అంటే త్యాగమే" అనే భావన కూడా అంతే ప్రమాదకరమైనది. అమ్మకు ప్రాణమే గొప్పది. ఆమె మనిషితనమే గొప్పది. ఆమె స్వేచ్ఛే అసలైన గౌరవం. అమ్మ స్వేచ్ఛే ఈ సమాజపు అసలైన నాగరికత.



— పాపని నాగరాజు

# విజయ్.. అనే నేను.. ఇదో కొత్త ఆరంభం

## సీఎంగా ప్రమాణం చేసిన టీవీకే అధినేత





**ముద్ర డెస్క్ :** తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయం. ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో దీన్ని భారీగా అభిమానులు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. సభా ప్రాంగణం మొత్తం విజయ్ నినాదాలతో మార్మోగిపోయింది.

ప్రముఖ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరుకాగా, సినీ నటి త్రిషా కృష్ణన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ విజయ్‌తో ప్రమాణ స్వీకారం చేశారు. "జోసెఫ్ విజయ్ అనే నేను..." అంటూ ఆయన ప్రమాణం ప్రారంభించగానే అభిమానులు ఉప్పొంగిపోయారు. ముఖ్యంగా విజయ్ తల్లిదండ్రులు భావోద్వేగానికి ఎంపికయ్యారు.

ప్రమాణ స్వీకారం అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన సీఎం విజయ్ భావోద్వేగ ప్రసంగంతో ఆకట్టుకున్నారు. జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించానని, ఆకలి బాధలు ఎలా ఉంటాయో తనకు తెలుసు. అభిమానులు తనను "తమ్ముడు" అంటూ ప్రేమగా పిలిచారని, అదే తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చారన్నారు. "నేను మీ కుటుంబ సభ్యుడిని. సినిమాల్లో మీరు నన్ను ఉన్నతస్థాయికి తీసుకెళ్లారు. నా ప్రయాణంలో ఎన్నో మానాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. ఇది నా ప్రభుత్వం కాదు.. ప్రజల ప్రభుత్వం" అని విజయ్ అన్నారు.

ప్రజాధనాన్ని వృథా చేయనని, ప్రజల సొమ్మును దోచుకోనని స్పష్టం చేసిన విజయ్.. అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. డ్రగ్స్ ఈరోజు నుంచే యుద్ధం ప్రారంభమవుతుందని తేలింది.

ఇక అధికార బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం విజయ్ మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. ఉచిత విద్య, మహిళా భద్రత, డ్రగ్స్ నిరోధానికి సంబంధించిన నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విజయ్ కేబినెట్‌లో ఏడుగురు టీవీకే నేతలకు, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చోటు దక్కింది. దీంతో తమిళనాడు రాజకీయాల్లో కొత్త సమీకరణలు ప్రారంభమయ్యాయి.

## ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నిలిపేద్దాం

**ముద్ర, హైదరాబాద్ :** కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో సమస్యలు తలెత్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యుద్ధాల ప్రభావంతో చమురు ధరలు పెరిగినా, ఆ భారం ప్రజలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భాజపా బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.దేశంలో పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, రైల్వేల్లో కూడా డీజిల్ వినియోగం తగ్గిస్తున్నామని తెలిపారు. చమురు వినియోగం తగ్గితే విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయని, ప్రజలు ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు తగ్గించాలని మోదీ పిలుపునిచ్చారు. విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ మ్యారేజ్‌లను కూడా తగ్గించుకోవాలని సూచించారు.

# రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించండి

- ప్రధాని మోడీకి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ
- పది అంశాల ప్రస్తావన



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా హైదరాబాద్ నగర విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రధాని నరేంద్ర మోడీకి బహిరంగ లేఖ రాశారు. ప్రధాని తెలంగాణ పర్యటన సందర్భంగా పది కీలక అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులపై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. తెలంగాణపై నిజమైన ప్రేమ ఉంటే ఈ అంశాలపై స్పష్టత ఇవ్వాలని, లేకుంటే రాష్ట్ర ప్రజలు బీజేపీని ద్రోహులుగా భావిస్తారని వ్యాఖ్యానించారు.

హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు, ప్రజా రవాణా అవసరాలు పెరుగుతున్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఇప్పటికే మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుందని, ఇప్పుడు ఫేజ్-2 విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేవని తెలిపారు. మొత్తం 122.9 కిలోమీటర్ల మేర రూ.38,595 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మెట్రో విస్తరణ ప్రాజెక్టుకు కేంద్రం తక్షణ ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు.

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు. ఇది కేవలం నది శుద్ధి కార్యక్రమం మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యం, పర్యాటక అభివృద్ధి, పట్టణ సుందరీకరణకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు అని వివరించారు. దీనిని జాతీయ స్థాయి అర్బన్ రివర్ పునరుద్ధరణ ప్రాజెక్టుగా గుర్తించి నిధులు, అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగానికి కేంద్ర కేబినెట్ ఆమోదంతో పాటు నిధులు విడుదల చేయాలని, దక్షిణ భాగం నిర్మాణానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే హైదరాబాద్‌పై రవాణా భారం తగ్గడంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్ వెంట ప్రతిపాదిత రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును వంద శాతం కేంద్ర నిధులతో చేపట్టాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్ట్ వరకు 12 లేన్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ నుంచి బెంగళూరు హైస్పీడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు నిర్మించాల్సిన రేడియల్ రోడ్లకు సుమారు రూ.45 వేల కోట్ల ఆర్థిక సహాయం అవసరమని, వీటిని జాతీయ అభివృద్ధి కారిడార్లుగా పరిగణించాలని సూచించారు.

హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ నగరంగా మార్చేందుకు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, జంక్షన్ అభివృద్ధి, జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం నిధులు కేటాయించాలని కోరారు. ఈ ప్రాజెక్టులు పూర్తైతే ట్రాఫిక్ ఒత్తిడి, కాలుష్యం, ఇంధన వినియోగం తగ్గుతాయని తెలిపారు.

తెలంగాణను సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ ఫ్యాబ్ సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాంతాలకు ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద ప్రాధాన్యం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు తుది ఆమోదం తెలపాలని కోరారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి నో అబ్జెక్షన్ ఇప్పించేందుకు కేంద్రం మధ్యవర్తిత్వం చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా రాష్ట్ర విభజన హామీల అమలు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ అభివృద్ధి, పెండింగ్ రైల్వే లైన్ల ఆమోదం, కొత్త జిల్లాలకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాల మంజూరు వంటి అంశాలను కూడా వెంటనే పూర్తి చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ ప్రధాని మోడీని కోరారు.

# హైదరాబాద్ లో సింధు ఆసుపత్రిని ప్రారంభించిన ప్రధాన మంత్రి మోడీ

**సింధు ఆసుపత్రి లో అత్యాధునిక సాంకేతిక విజ్ఞానం, నూతన ఆవిష్కరణల కు ప్రాధాన్యాన్ని ప్రశంసించిన ప్రధాన మంత్రి**




**ముద్ర, హైదరాబాద్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్ లో సింధు ఆసుపత్రిని ప్రారంభించారు. నగరంలో చుట్టుపక్కల ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణకు సంబంధి మౌలిక సదుపాయాలను మెరుగు పరచడం కోసం ఈ ఆసుపత్రి ఒక ప్రశంసనీయమైన ప్రయాస అని ప్రధాన మంత్రి అన్నారు. ఆసుపత్రి బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలను ఏకీకృతం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని కూడా ఆయన ప్రశంసించారు. ఈ మేరకు 'ఎక్స్' ద్వారా పంపిన ఒక సందేశంలో "హైదరాబాద్ లో సింధు ఆసుపత్రి ని ప్రారంభించాను. నగరం, చుట్టుపక్కల ప్రాంతాల లో ఆరోగ్య సంరక్షణ సంబంధి మౌలిక సదుపాయాల ను మెరుగు పరచడం కోసం చేపట్టిన ప్రయాస ప్రశంసనీయం. ఆసుపత్రి బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలను ఏకీకృతం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రశంసనీయం" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# చంద్రబాబుతో ప్రత్యేక భేటి.. పవన్ కు పరామర్శ

**పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై ఆరా తీసిన ప్రధాని మోదీ**
**హైదరాబాద్ పర్యటనలో చంద్రబాబు నివాసానికి వెళ్లిన మోదీ**
**"మా కుటుంబానికి మధుర జ్ఞాపకం" అంటూ చంద్రబాబు భావోద్వేగ పోస్ట్**
**పవన్‌తో ఏకాంత భేటీ.. ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశం**
**ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రధాని మద్దతుపై చంద్రబాబు కృతజ్ఞతలు**



**ముద్ర డెస్క్ :** హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇటీవల సర్జరీ చేయించుకున్న పవన్ కళ్యాణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటుండగా.. ఆయనను ప్రధాని పరామర్శించి సంఘీభావం తెలిపారు. పవన్ నివాసానికి చేరుకున్న మోదీకి జనసేనాని సాదరంగా స్వాగతం పలికారు. కొద్దిసేపు ఇద్దరూ ఏకాంతంగా మాట్లాడుకున్నట్లు సమాచారం.

అనంతరం ప్రధాన మంత్రి మోదీ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు. తన ఇంటికి ప్రధాని రావడంపై చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. "మా కుటుంబం ఎప్పటికీ మర్చిపోలేని మధుర జ్ఞాపకంగా ఈ సాయంత్రం నిలిచిపోతుంది. మా నివాసంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారికి ఆతిథ్యం ఇవ్వడం మాకు లభించిన గొప్ప గౌరవం" అని పేర్కొన్నారు.

అలాగే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో ప్రధాని అందిస్తున్న నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో చంద్రబాబు కుటుంబ సభ్యులు ఆత్మీయంగా గడిపినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పర్యటనలో మోదీ.. పవన్ కళ్యాణ్‌ను పరామర్శించడం, అనంతరం చంద్రబాబు నివాసానికి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.



# తెలంగాణలో బీజేపీ ప్రభుత్వమే వస్తుంది

-ప్రధాని మోదీ



**ముద్ర , తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వమే ఏర్పడుతుందని ప్రధాని నరేంద్రమోదీ ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఓటేస్తున్నారని అన్నారు. పశ్చిమబంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిందని, అక్కడ రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఓడిపోయాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల్లో కూడా అలాంటి ఉత్సాహమే కనిపిస్తోందన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ చెప్పారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రాజెక్టులతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలేనని విమర్శించారు. తెలంగాణను నక్సలైట్ల రహిత రాష్ట్రంగా మార్చామని, వికసిత్ తెలంగాణ లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 11-05-2026
www.mudranews.in | @mudranews



**ఫ్యాటీ లివర్ వ్యాధిని అడ్డుకోవాలంటే?**

**మద్యపానానికి దూరంగా ఉండండి:** మద్యం సేవించడం వల్ల కాలేయ కణాలు దెబ్బతిని వాపు వస్తుంది. కాలేయం త్వరగా కోలుకోవాలంటే మద్యపానాన్ని పూర్తిగా మానేయడం ఉత్తమ మార్గం.



# పొరపాట్లు సరిదిద్దుకొని కాంగ్రెస్ ను బలోపేతం చేయాలి

**- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్**



**ముద్ర, శేరిలింగంపల్లి:** పొరపాట్లు సరిదిద్దుకొని కాంగ్రెస్ ను బలోపేతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహ రెడ్డి, ఇంచార్జ్ ఎంపీ మల్లు రవి ఆదేశాల మేరకు ఆయన శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని నల్లగండ్ల గ్రామంలో నిర్వహిం చిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి నాయకులకు దిశా నిర్దేశం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తుచేశారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధిష్టానానికి కృతజ్ఞ తలు తెలిపారు. తక్కువ సమయంలోనే కార్యకర్తల శ్రమతో లక్ష పది వేలకుపైగా ఓట్లు సాధించగలిగామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరి దిద్దుకొని బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, నాయకులు–కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించాలని సూచించారు. ప్రజల అవసరాలు, మౌలిక వసతుల సమస్యలపై కార్యకర్తలకు మంచి అవగాహన ఉంటుందని, ప్రతి కార్యకర్త పార్టీకి బలమని అన్నారు.

2028 సార్వత్రిక ఎన్నికల్లో శేరిలింగం పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి బూత్ లో కనీసం పది మంది కార్యకర్తలు ఉండాలని, బూత్ లెవల్ ఏజెం ట్లు అదే బూత్ పరిధిలో ఓటు కలిగి ఉండా లని తెలిపారు. అలాగే ప్రతి కుటుంబం నుంచి ఒక్కరికే అవకాశం ఇవ్వాలని, బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.



## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మున్సి పాలిటీ పరిధి 6వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాధవ్ రెడ్డి, కౌన్సిలర్లు నిజాం, ఆసిఫా బేగం ఖాదర్, శ్రీనివాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైల్వే పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**ముద్ర, మల్కాజ్‌గిరి:** ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ సమీపంలో కొనసాగుతున్న ఎల్‌హెచ్‌ఎస్ నిర్మాణ పనులను స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి ఆదివారం పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో పాటు వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, హేమంత్ పటేల్, స్థానిక కాలనీవాసులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిపై వ్యాఖ్యలు సరికాదు..



**ముద్ర, మహబూబ్ నగర్:** రైతులు పండించిన పంటను కొనుగోలు చేయలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జడ్చర్ల మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని రైతులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డిపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్యే తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత దూషణలకు దిగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

## నిలిపి ఉన్న బస్సును ఢీకొట్టిన ఫైర్ ఇంజన్..

**- పలువురికి గాయాలు**



**ముద్ర, జోగులాంబ గద్వాల:** జోగులాంబ జిల్లాలోని గద్వాల మండలం పరుమాల స్టేజీ సమీపంలో ఆదివారం నిలిపి ఉంచిన ఆర్టీసీ బస్సును ఫైర్ ఇంజన్ రివర్స్ తీస్తూ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసం కాగా, లోపల ఉన్న పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం..

గద్వాల నుండి అయిజకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పరుమాల స్టేజ్ సమీపంలో ప్రయాణి కులను దించేందుకు ఆగి ఉంది. అదే సమయంలో అక్కడ ఉన్న అగ్నిమాపక వాహనం డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని వెనక్కి తీశారు. వెనుక ఆగి ఉన్న బస్సును గమనించకపోవడంతో ఫైర్ ఇంజన్ బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు అద్దాలు పగిలిపోయాయి. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో బస్సులో ఉన్న ప్రయాణికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పలువురు ప్రయాణికులకు గాయాలు కాగా, స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ఎంఈఓ ఇందుప్రియ**



**ముద్ర, తాండూరు:** ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే వేసవి ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఇందుప్రియ సూచించారు. ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాట్లా డారు. నంబర్ వన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 11 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాలకు ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు హాజరు కావాలన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, యోగా, ఆటల పోటీలను సాధన చేయించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే శిబిరాల్లో అల్పాహారం అందిస్తామని తెలిపారు. పదిలో ఫెయిలైన విద్యార్థులకు ఈనెల 12 నుంచి జూన్ 3 తేదీ వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. అన్ని విషయాలకు సంబంధించి ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి బోధన చేస్తారని అన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు నగదు పారితోషికం అందజేస్తామన్నారు. ఈ నెల 13న సర్పంచులు, వార్డు సభ్యులకు ఎస్వీఆర్ వేదికలో విద్యా వ్యవస్థపై అవగాహన కల్పిస్తామని వివరించారు.



## వంతెన పనులు పరిశీలించిన మంత్రి

**ముద్ర, మహబూబ్ నగర్:** మండల కేంద్రంలోని కల్వాల్ నుంచి సీపూర్ గ్రామం మధ్యలో రూ. 6కోట్ల 40లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు కమ్ బ్రిడ్జి నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. గత 10రోజుల కిందట వంతెనకు మంత్రి శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి నిర్మాణం లోని నాణ్యత పనులను మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. మంత్రి ఇంజినీర్లకు తగు సూచనలు చేశారు. త్వరలో వర్షాకాలం లోపు వంతెన నిర్మాణం పూర్తయి కావాలని తెలియజేశారు. బ్రిడ్జి పనులు వేగంగా జరపాలని ఇంజనీర్లకు తెలియజేశారు. అతి తొందరలో రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రయాణం సాగించవచ్చని పనులు వేగవంతం చేయాలని అన్నారు.

## ఆటో ప్రయాణికుల దోపిడీ ముఠా అరెస్ట్

**ముద్ర, రంగారెడ్డి:** ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులను బెదిరించి నగదు, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్లు దోచుకున్న కేసును రూరల్ పోలీసులు ఛేదించి నలుగురిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఈనెల 7న కొత్తూర్‌కు చెందిన ప్రిన్స్ కుమార్ తన స్నేహితులు అభిషేక్ కుమార్, రోషన్ కుమార్‌తో కలిసి చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో కొత్తూర్‌కు బయలుదేరారు. శంషాబాద్ దాటి ఘాన్సీమియాగూడ గ్రామ పరిధిలోని జాతీయ రహదారి–44 వద్ద ఆటో డ్రైవర్ తన ముగ్గురు సహచరులతో కలిసి బాధితులను బెదిరించి దాడి చేశారు. అనంతరం వారి వద్ద నుంచి రూ.1,800లు, రెండు వెండి చైన్లు, వెండి ఉంగరం, రెండు మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు. గూగుల్ పే ద్వారా మరో రూ.5,000 బలవంతంగా బదిలీ చేయించుకొని, విషయం బయటపెడితే చంపేస్తామని హెచ్చరించి హైవే పై వదిలేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, ప్రత్యేక బృందాల సహాయంతో నిందితులు అబ్దుల్ యాసిన్ (ఆటో డ్రైవర్), మహమ్మద్ మోసిన్, అబ్దుల్ మోసిన్, అతిఫ్ ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. నిందితుల నుంచి దోచుకున్న నగదు, మొబైల్ ఫోన్లు, వెండి చైన్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆటోను కూడా పోలీసులు సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన ఎస్సై రాఘవేందర్, కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఘనంగా వీరభద్ర స్వామి ఉత్సవాలు

**- బండ లాగుడు పోటీలను ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే**



**ముద్ర, మహబూబ్ నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా పాన్‌గల్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో వీరభద్ర స్వామి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణా రావు, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి ప్రజలు వందలాదిగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర బండ లాగుడు పోటీలను మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, సర్పంచ్ సుగుణమ్మ, నాయకులు రవి, వెంకటేష్, జయరా ములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి తాగునీరు అందించడమే లక్ష్యం

**- సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**ముద్ర, మహబూబ్ నగర్:** ప్రతి గ్రామానికి తాగునీరు అందించడమే లక్ష్యం అని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో ఐక్యత ఫౌండేషన్ ముందుంటుందని తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పోచమ్మ గడ్డ తండాలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో రూ. 1లక్ష 50వేల తో ఏర్పాటు చేసిన ఉచిత త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఆయన సర్పంచ్ మహిపాల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రక్షిత తాగునీటి సౌకర్యం ఎంతో ముఖ్యమని, చాలా ప్రాంతాల్లో ప్రజలు శుద్ధి చేయని నీటిని వినియోగించడం వలన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా తండాలలో నివసించే ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పోచమ్మ గడ్డ తండాలో ఇంతకు ముందు కూడా తండా ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి తండా అభివృద్ధిలో భాగమయ్యామని, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి రూ.1.50 లక్షల వ్యయంతో ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా తండా ప్రజలకు శాశ్వతంగా స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి వస్తుందని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గిరిజన తండాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఐక్యత ఫౌండేషన్ ముందుంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ మా సమస్యలను వెంటనే గుర్తించి స్పందిస్తూ అభివృద్ధికి సహకరిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న తమకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని శుద్ధి నీటిని మా తండా వాసులకు అందిస్తున్న సుంకిరెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు.


ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, ఆయా గ్రామాల సర్పంచ్ లు గన్యా నాయక్, రమేష్ నాయక్, మాజీ సర్పంచ్ పంతుల నాయక్, వార్డు మెంబర్ శ్రీరామ్ నిర్మలా, హనుమంత్, సీనియర్ నాయకులు వెంకట్ నాయక్, సేవ్యా నాయక్, రేక్యానాయక్, మున్య నాయక్, జైపాల్, తిరుపతి, శ్రీను నాయక్, లక్ష్మణ్ నాయక్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 11.05.2026
www.mudranews.in | @mudranews



**ఫ్యాటీ లివర్ వ్యాధిని అడ్డుకోవాలంటే:**

చక్కెర పానీయాలు తగ్గించండి:



తీపి సోడాలు, ఎనర్జీ డ్రింక్స్, ప్యాక్ చేసిన జ్యూస్‌లలో ఉండే ఫ్రక్టోజ్ కాలేయానికి హాని కరం. వీటికి బదులుగా తగినంత నీరు లేదా కొబ్బరి నీళ్లు వంటి సహజ పానీయాలు తీసుకోండి.

# ఇంటింటికీ బొట్టుపెట్టి.. కరపత్రాలు పంచి...

**-హిందూ ఏక్తా యాత్రకు ఆహ్వానిస్తున్న కాషాయ శ్రేణులు**

**-గతం కంటే జోష్ నింపుందుకు సిద్ధమైన కేంద్ర మంత్రి బండి సంజయ్**



**ముద్ర, కరీంనగర్:** నగరంలో ఈ నెల 12న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'హిందూ ఏక్తా యాత్ర కు ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. హిందువులందరినీ సంఘటితం చేయడమే లక్ష్యంగా ప్రతి ఏటా బాల గంగాధర్ తిలక్ గణేశ్ ఉత్సవాలను ప్రారంభించిన సంగతి తెలిసిదే. అదే స్పూర్తితో హిందువులందరినీ రాజకీయాలకు అతీతంగా సంఘటితం చేయాలనే లక్ష్యంతో సరిగ్గా 16 ఏళ్ల క్రితం బండి సంజయ్ కుమార్ గుప్పెడు మందితో కరీంనగర్ లో ''హిందూ ఏక్తా యాత్ర''ను ప్రారంభించారు. ప్రతి ఏటా హిందూ ఏక్తా యాత్రకు వచ్చే హిందువుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈసారి అంతకు మించి ప్రజలు హాజర వుతారని అంచనా వేస్తున్నారు. అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**గతంకంటే మిన్నగా...**

గతానికి భిన్నంగా ఈసారి 'హిందూ ఏక్తా యాత్రకు రావాలంటూ కాషాయ శ్రేణులు, కార్పొరేటర్లు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్నారు. కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. కాషాయ శ్రేణులు తమ తమ డివిజన్లలోని, కాలనీల్లోని గోడలపై 'హిందూ ఏక్తా యాత్ర'కు తరలి రావాలంటూ స్వయంగా వాల్ పెయింటింగ్ రాశారు.

**వేసవిలో ఇబ్బంది లేకుండా...**

బండి సంజయ్ ఆధ్వర్యంలో వైశ్యా భవన్ నుంచి ప్రారంభమయ్యే ఏక్తా యాత్రలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు జనం ఉత్సాహం చూపుతుండటంతో వారికి ప్రత్యేకంగా రవాణా సదుపాయం కల్పించేందుకు కాషాయ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఏక్తా యాత్రలో పాల్గొనే వారికి కాషాయ శ్రేణులు, హిందుత్వ వాదులు, వ్యాపారులు స్వచ్ఛందంగా మంచినీళ్లు, మజ్జిగ, ఇతర ఆహార పానియాలను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**యాత్ర ఆరంభమయ్యేది ఇలా..**

వైశ్య భవన్ నుంచి 12న సాయంత్రం 4 గంటలకు హిందూ ఏక్తా యాత్ర ర్యాలీ ప్రారంభం కానుంది. ర్యాలీ ఆరంభంలోనే వైశ్యాభవన్ వద్ద హిందుత్వ వాదులను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగిస్తారు. అనంతరం ప్రారంభమయ్యే ర్యాలీ రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్ , వన్ టౌన్, వేంకటేశ్వర టెంపుల్, అమరవీరుల స్థూపం, జయశంకర్ సర్కిల్, రాజీవ్ చౌక్ మీదుగా తిరిగి వైశ్య భవన్ కు చేరుకుంటుంది.

**ఆకట్టుకోనున్న ప్రదర్శనలు,,**

దాదాపు 6 గంటలపాటు కొనసాగే హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనే హిందూత్వ వాదులు, కరీంనగర్ పట్టణ ప్రజలను ఆకట్టుకునేలా వివిధ రూపాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కేరళ నుంచి హనుమంతుడు, హైదరాబాద్ నుంచి శ్రీరాముడి విగ్రహాలను కరీంనగర్ కు తరలిస్తున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకునే కళాకారులను రప్పిస్తున్నారు. కేరళ నుంచి డప్పు వాయిద్య కళాకారులు వస్తున్నారు.

**జోష్ నింపేందుకు సిద్ధం..**

కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలతో ప్రజల్లో అయోమయం నెలకొన్న నేపథ్యంలో వాటన్నిం టినీ పటాపంచలు చేస్తూ హిందుత్వ వాదుల్లో జోష్ పేందుకు కేంద్ర మంత్రి సిద్ధమయ్యారు.

## అల్ఫోర్స్ లో ఘనంగా సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం



**ముద్ర, కరీంనగర్ :** నగరంలోని అల్ఫోర్స్ కాలేజీలో ఆదివారం నాలుగో రోజు సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, పరివారంతో కలిసి సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం ప్రారంభోత్సవం సందర్భంగా బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రపెల్లి మహేశ్వర శర్మ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.శ్రీరామున్ని ఆరాధించడం వల్ల సకల శుభఫలాలు కలుగుతాయని తెలిపారు. శ్రీరాముడు ధర్మానికి ప్రతీకని, సత్యానికి నిర్వచనమన్నారు. వాల్మీకి మహర్షి రచించిన సుందరకాండని పఠించిన, విన్నా మానసిక, శారీరక శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీరామున్ని ఆదర్శంగా తీసుకొని, వారి గుణాలను అలవర్చుకొని విజేతలుగా నిలవాలని కోరారు. రాముడు సీతను కనుగొన్న విధానం చాలా శాంతియుతంగా జరిగిందన్నారు. ఆ విధానాన్ని ప్రతి ఒక్కరూ అవలంభించినట్లయితే సమాజంలో ఎటువంటి భేద భావాలు ఉండవన్నారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రపెల్లి మహేశ్వర శర్మ మార్గదర్శకమున నిర్వహిస్తున్నటువంటి ఈ ప్రవచనాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని రోజు వారీ కార్యకలాపాలలో అవలంబించి విజయాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు భజనలు స్ఫూర్తి నింపాయి.

## రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కు సన్మానం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువాడి నర్సింగరావు ను ఆదివారం పీ ఆర్ టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయిని పెల్లి ఆనంద్ రావు ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. నర్సింగరావు కు పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీ ఆర్ టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వూటూరి మహేశ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కన్నవేణి మల్లారెడ్డి, ధన్నపున్నేని వేణు గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

**-రూ.225 కోట్లతో ఆధ్యాత్మిక కేంద్రంగా బాసర**

**-రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయనున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు స్పష్టం చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదివారం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు గురించి పర్యటించారు. ఆలయ ప్రాంగణం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వ్యాస గుహ తదితర ప్రాంతాలు తిరిగి చూశారు. మాస్టర్ ప్లాన్ అమలు గురించి కీలక అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయాన్ని రూ.225 కోట్లతో ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. బాసర మాస్టర్ ప్లాన్ అమలుతో ఆలయ రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. బాసర క్షేత్రం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ బాసర ఆలయ అభివృద్ధి కోసం ఇటీవల ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమలు ద్వారా ఆలయం అభివృద్ధి చెందనుందని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, తదితర అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి సామూహిక వ్రతం



**ముద్ర, కోరుట్ల:** పట్టణంలోని అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా శనివారం సాయంత్రం సామూహిక శ్రీ వేంకటేశ్వర స్వామి సామూహిక వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు బీర్నంది నరసింహచారి ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు ఫల పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించి, సహస్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. పూజానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయానికి వచ్చిన భక్తులు అల్పాహారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ జువాడి కృష్ణారావు, ఆలయ కమిటీ చైర్మన్ యతిరాజం నర్సయ్య, కర్తలు నేతి శ్రీనివాస్, కటకం దివాకర్, కోట గంగాధర్, గోడికే రాములు, చిలువేరు విజయ్, చిట్యాల పద్మ, ఆలయ అధికారి ఎం. విక్రమ్ జూనియర్అ ,సిస్టెంట్ నర్సయ్య, తిరుమల గంగాధర్, పూప్పల ప్రభాకర్, ఆండాళ్ గోష్టి భక్త బృందం, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## నేడు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష పదవి కోసం సోమవారం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఇన్ హోటల్ లో ఉదయం పదకొండు గంటలకు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి ఆదిలాబాద్ పరిశీలకులు సమత సుదర్శన్ మారుతి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ పార్టీనిర్మల్ నియోజకవర్గం ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు , మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, ముధోల్ నియోజకవర్గ ఇంచార్జి నారాయణరావు పటేల్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

# స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**- దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** సమాజ సేవలో ముందుండే స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కొనియాడారు. ఆదివారం జగిత్యాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆపి, రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో జిల్లా కేంద్రంలోని పావని కంటి హాస్పిటల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ జగిత్యాల పూర్వ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, డిఎస్పీ పురుషోత్తం రెడ్డి దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు తోడుగా రోటరీ క్లబ్ ఆపి, రెడ్ క్రాస్ సోసైటీ లాంటి స్వచ్ఛంద సంస్థలు సమాజ సేవలో ముందుకు వస్తూ వారి వంతు బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. నాలుగు దశాబ్దాలుగా జగిత్యాల ప్రాంతంలో సేవయే పరమావధిగా తామందరము కలిసి చేస్తున్న కృషి ఫలితంగానే ఈరోజు ప్రజలందరి ఆదరణతో తాను ఎమ్మెల్యే స్థాయికి ఎదగగలిగానని తెలిపారు. ప్రధానంగా ఉచిత కంటి ఆపరేషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, అర్హులైన దివ్యంగులకు ఉపకరణాలు, విద్యార్థులకు కంటి పరీక్షలు, రోటరీ గంగా పేరుతో మంచినీటి ట్యాంకులు ఏర్పాటు, ఉచిత వైద్య శిబిరాలు లాంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలను ఎలాంటి లాభపరీక్ష లేకుండా టీం వర్క్ గా నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రభుత్వాలు పేద ప్రజల కోసం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు తోడుగా, స్వచ్ఛంద సంస్థలు చేసే కార్యక్రమాలకు అండగా నిలిచే పారిశ్రామిక వర్గాల వారు, వివిధ వ్యాపార సంస్థల వారు సీఎస్ఆర్ నిధులతో చేపట్టే నిధులు అర్హులైన వారికి ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. అనంతరం డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ రోటరీ, ఆపి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థలు నిర్వహించే కార్యక్రమాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడటం అభినందనీయమన్నారు. వారు చేస్తున్న కృషి హర్షనీయమని తెలిపారు. టౌన్ సీఐ కరుణాకర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ కార్యదర్శి మంచాల కృష్ణ, కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టౌన్ సీఐ కరుణాకర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ కార్యదర్శి మంచాల కృష్ణ, కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు, సభ్యులు కొత్త ప్రతాప్, డా. వెంకటేశ్వర్, డా.విజయ్, డా.శేఖర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, కౌన్సిలర్ లు సుంకేటి మమత, దుమాల రాజ్ కుమార్, కోరే గంగమల్లు, నాయకులు బాల ముకుందం, ఖజిం అలీ, బాస మహేష్, వేణు, అబ్బూరి మల్లేశం గౌడ్, పులి నర్సయ్య, వంశీ, మహేష్, రవి గౌడ్, రామకృష్ణారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీజేఎస్ ప్లీనరీని విజయవంతం చేయండి





**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** హైదరాబాద్ లో ఈ నెల 12న నిర్వహించబోయే తెలంగాణ జన సమితి ప్లీనరీని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్ రావు, ఉమ్మడి జిల్లా ఇంచార్జి కంతి మోహన్ రెడ్డి కోరారు. పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి కడపత్రి తిలక్ రావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఇంచార్జి కంతి మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12 న రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని జల విహార్ లో నిర్వహించే తెలంగాణ జన సమితి నాలుగో ప్లినరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సాధించిన తెలంగాణ లో అమరుల ఆకాంక్షలు, అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలన్న ఉదేశ్యంతో తెలంగాణ జన సమితి పార్టీని 2018 లో పార్టీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముధోల్ ఇంచార్జి సర్దార్ వినోద్ కుమార్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి దిలీప్, జిల్లా కార్యదర్శి చిట్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 11.05.2026
www.mudranews.in | @mudranews



## ఫ్యాటీ లివర్ వ్యాధిని అడ్డుకోవాలంటే?



మధుమేహాన్ని అదుపులో ఉంచుకోండి. బ్లడ్ షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉంటే కాలేయంలో కొవ్వు త్వరగా చేరుతుంది. సరైన మందులు మరియు ఆహారం ద్వారా షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం.

## ఇంటి వద్ద నుండి కేసులు నమోదు

ఎస్పీ కే నరసింహ





**ముద్ర, సూర్యపేట జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాధితుల ఇంటి వద్ద నుండే కేసు నమోదు, ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్ కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ పటిష్టంగా ముందుకు తీసుకెళ్తూ బాధితులకు ఇంటివద్దే పోలీసు సేవలు అందించడం జరుగుతుంది అని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ అన్నారు. సంఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే వేగంగా సంఘటనా స్థలానికి బాధితుల ఇంటికి సంభందిత పోలీసు అధికారులు చేరుకుని పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గడిచిన వారం రోజులుగా బాధితుల ఇంటి నుండి 111 కేసులు నమోదు చేసి బాధితులకు సేవలు అందించడం జరిగిందని తెలిపారు. మహిళల బాలల వృద్ధుల పట్ల ఆకృత్యాలు జరిగినప్పుడు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, దొంగతనాలు జరిగినప్పుడు, వ్యక్తులపై భౌతిక దాడులు జరిగినప్పుడు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆకృత్యాలు జరిగి నప్పుడు, విద్యాసంస్థల్లో ర్యాగింగ్ జరిగి నప్పుడు, బాల్య వివాహాలు జరిగే సమయంలో సమాచారం అందుకున్న వెంటనే బాధితుల ఇంటి వద్ద లేదా వారికి అనుకూలమైన ప్రదేశంలో ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి కేసు పత్రాన్ని బాధితులకు అందజే స్తున్నాము.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమస్యలపై డయల్ 100, ఫోన్ ద్వారా సమాచారం అందించి పోలీస్ స్టేషన్కు రావాల్సిన అవసరం లేకుండానే కేసులు నమోదు చేసుకోవాలని అన్నారు.


## ఇకపై ప్రతీ సోమవారం డివిజన్ స్థాయిలో ప్రజావాణి

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** ఇక పై ప్రతి సోమవారం ఆర్ డి ఓ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.



డివిజన్ స్థాయి ప్రజావానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్డిఓ లను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగు తున్నదని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక పై ప్రతి సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. డివిజన్ సాయి ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి వ్యవహరిస్తారనితెలిపారు. డివిజన్ పరిధిలోని డివిజనల్ అధికారులు అందరూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు.

## అంగరంగ వైభవంగా కళ్యాణం



స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పట్టు పీతాంబరం ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించిన స్వామివారికి అర్చక స్వాములు శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య కళ్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు, స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ఆలయంలో సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరిన గోపృష్ఠ దర్శనాన్ని చేయించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఆదివారం సుమారు 5 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

– ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

# మెగా జాబ్ మేళా విజయవంతం





- ఉపాధి అవకాశాల కల్పన అభినందనీయం
- ఎంపీ చామల, ప్రభుత్వ విప్ బీర్ల
- జాబ్ మేళాలో 1500 మంది ఎంపిక

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకై కుంభం ఫౌండేషన్ చేస్తున్న మెగా జాబ్ మేళా అభినందనీయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కుంభం ఫౌండేషన్, వన్ఎంవన్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా విజయవంతంగా కొనసా గుతోంది. రెండు రోజులుగా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు, టోకెన్ల కేటాయింపు కార్యక్రమం విజయవంతంగా పూర్తికాగా, ఆదివారం ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడ తాయని, ఈ జాబ్ మేళా అనేక కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పిస్తోందని కొనియాడారు. కుంభం ఫౌండేషన్ ఛైర్పర్సన్ కుంభం కీర్తి రెడ్డి, వలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత ధైర్యంగా ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలని సూచించారు. ఉద్యోగం చిన్నదైనా సరే అనుభవాన్ని సంపాదించడం ఎంతో ముఖ్యమని, ప్రతి యువకుడు తన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకో వాలని తెలిపారు. నైపుణ్యం, అనుభవమే భవిష్యత్తులో మరింత ఉన్నత అవకాశాలకు దారి తీస్తాయన్నారు. రెండు రోజులుగా అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి టోకెన్ల కేటాయింపు ప్రక్రియను క్రమబద్ధంగా పూర్తి చేసినట్లు తెలిపారు. వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, అర్హత సాధించిన వారికి నియామక పత్రాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. భువన గిరిలో యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగావకాశాలకు అవస రమైన శిక్షణ అందించే విధంగా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఐబీమ్ ప్రతిని ధులను ఎమ్మెల్యే కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఐబీమ్ అసోసియేట్ డైరెక్టర్ ప్రసన్న నోరి, డైరెక్టర్ అభిరామ్, దీపిక వెంకటేష్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, అధికారులు, వలంటీర్లు, ఉద్యోగార్థులు భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు. జాబ్ మేళాలో దాదాపు 1500 మంది సెలక్ట్ అయ్యారని కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి తెలిపారు.

# నేటి నుండి జిల్లాలో 'విద్యా వారోత్సవాలు'


- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు జిల్లావ్యాప్తంగా 'విద్యా వారోత్సవాలను' అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం సాధించి న విజయాలను ప్రజలకు వివరించడానికి ఈ ఉత్సవాలు ఒక వేదికగా నిలుస్తా యన్నారు. సోమవారం జిల్లాలోని పాఠశా లల్లో పూర్తయిన సివిల్ పనుల ప్రారంభోత్సవం, మంజూరైన కొత్త పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అలాగే సృజనా త్మక వేసవి శిబిరాలను (సమ్మర్ క్యాంప్స్) జిల్లాలోని 17 పీఎంశ్రీ పాఠశాలలలో ప్రారంభిస్తారు. రాజపేట మండలం లోని పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ రాజపేట పాఠశాలలో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ పనుల ప్రార ంభోత ్సవ కార్యక్రమం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా కలెక్టర్, అదనపు కలెక్టరు, డీఈవో సమక్షంలో నిర్వహించబడుతుం దన్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, నాబార్డ్ పనులు తదితర మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించబడనున్నాయి. మే 12 పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం 'రెమెడియల్ క్యాంపుల' ప్రారంభోత్సవం. ఫెయిల్ అయిన విద్యార్థులందరూ సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించేలా అవగాహన కల్పిస్తారు. 13న నియోజకవర్గ స్థాయిలో సర్పంచ్‌లు, మున్సిపల్ వార్డు సభ్యులతో వర్క్‌షాప్. ప్రభుత్వ విద్యా పథకాల్లో స్థానిక సంస్థల భాగస్వామ్యం, 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల' (ఎఏపీసీ ) పాత్రపై చర్చ, 14న 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' ర్యాలీలు తల్లిదండ్రుల సమావేశాలు మెగా పీటీమ్ నిర్వహణ, ఉత్తమ హాజరు కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాల పంపిణీ, వంటల పోటీలు నిర్వహి స్తారు. 15న జిల్లా, మండల గ్రంథాల యాల్లో 'గ్రంథాలయ దినోత్సవం'. పుస్తక ప్రదర్శనలు, ఉత్తమ పాఠకులకు గుర్తింపు కార్యక్రమాలు చేపడతారు. 16న 'కళా వైభవం' పేరుతో సాంస్కృతిక దినోత్సవం. కోలాటం, లంబాడీ నృత్యం, ఒగ్గు కథ వంటి జానపద కళల ప్రదర్శనలు విద్యార్థుల చిత్రలేఖన ప్రదర్శనలు ఒక పీఎంశ్రీ పాఠశాల నందు ఉంటాయి. మే 17 విద్యా విజయోత్సవం' – ముగింపు వేడుకలు. జిల్లా స్థాయి టాపర్లు (పదవ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడలు) 9 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలతో సత్కారం, వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజాప్రతి నిధులు, అధికారులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

# నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికి యోగా తప్పనిసరి

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికి యోగా తప్పనిసరి అని, విద్యార్థులు చదువు తోపాటు యోగ తప్పనిసరిగా నేర్చుకోవాలనీ తెలంగాణ యోగ ప్రచార సమితి అధ్యక్షులు ఎం.ప్రసాద్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కళ్యాణ మండపంలో 15 రోజులుగా వేసవిలో విద్యార్థులకు సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శ్రీ వాసవి సేవా సమితి సహకారంతో ఉచి యోగా శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సూర్యాపేట ఉన్నత యోగ శిక్షణ కేంద్రం గురూజీ చాడ పాపిరెడ్డి శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, బ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి కట్టెకోల పూర్ణచందర్ రావు తో కలిసి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్యా పోటీ విధానంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు వారికి యోగా ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు సైనస్, ఆస్తమా, ఆయాసం వంటి జబ్బులతో బాధపడుతున్నారని, వీరికి యోగా ద్వారా శ్వాసకు సంబంధించినటువంటి ప్రాణాయామములు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి మీ పిల్లలు యోగ నేర్చుకునే విధంగా ప్రోత్సహించా లన్నారు.యోగా వలన ఆత్మవిశ్వాసం పెంచుతుందని, యోగ ఆసనాలు, ప్రాణాయామముల ద్వారా మీ పిల్లలకు శక్తితో పాటు మానసిక ఉత్సాహం పెరుగుతుందన్నారు. ముఖ్యంగా యోగా చేయడం వలన విద్యార్థులకు మెదడు చురుకుగా పనిచేసి జ్ఞాపకశక్తి పెరిగి చదువులో రాణించగ లుగుతారన్నారు. 15 రోజుల పాటు శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ యోగ ప్రచార సమితి కార్యదర్శులు ఝాన్సీ లక్ష్మి, సుదర్శన్ రెడ్డి శ్రీ వాసవి సేవాసమితి గౌరవ సలహాదారులు గోపారపు రాజు,కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్,ఉపా ధ్యక్షులు కుంచపర్తి రాజశేఖర్ సభ్యులు పోలా లక్ష్మీనా రాయణ ,బెలిదే శ్రీనివాసు,వెంపటి శబరి నాథ్ యోగసా ధకులు వల్కి లింగయ్య, వేల్పుల సుధాకర్, , గోరెంట్ల శ్రీనివాస్, మమత, శ్రీదేవి,జ్యోతి, జయలక్ష్మి, ఓ లింగయ్య, వెంకట్ రెడ్డి వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ నాగరాజు, బాలకృష్ణ, శ్రీనాథ్, లక్ష్మి, విజయలక్ష్మి, విజయ్ సంతోష్,వి ద్యార్థిని,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## అమ్మ ప్రేమలా... రక్తదానం జీవదానం



**ముద్ర, ఖమ్మం:** అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని నిరుపేద తలసేమియా చిన్నారుల కోసం ఖమ్మం నగర వాకర్స్ ఆదివారం ఉదయం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేవలం నడకతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా, మాతృమూర్తుల త్యాగానికి చిహ్నంగా, రక్తం కరువై కొట్టు మిట్టాడుతున్న నిరుపేద చిన్నారులకు తమ రక్తాన్ని అందించి ప్రాణదానం చేయాలన్న సంకల్పంతో 50 మంది సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని పంపారు. ఈ సందర్భంగా రాకం శ్యామ్ బాబు మాట్లాడుతూ అమ్మ గర్భంలో ప్రాణం పోస్తుందని, రక్తదాతలు మరోసారి ఆ ప్రాణాన్ని నిలబెడతారు అని అన్నారు. ఒక యూనిట్ రక్తం, ఒక చిన్నారి జీవితానికి కొత్త ఊపిరిని అందిస్తుందన్నారు. తలసేమియా చిన్నారులకు ప్రతి నెలా రక్తం అవసరం అవుతుందని, అలాంటి పిల్లల కోసం ముందుకు వచ్చి రక్తదానం చేయడం నిజమైన మానవసేవ అని పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా అనేక మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని, యువత ఎక్కువగా ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాలొనాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంకల్ప సంస్థ సభ్యులు రవి, డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ రాంబాబు పాల్గొని రక్తదాతలను అభినందించారు. అలాగే వాకర్స్ కమిటీ సభ్యులు రామనాథం, రాకం శ్యామ్ బాబు, విజయ్, వెంకట్, మురళీ, నరసింహారావు, రామశేఖరం, గోవర్ధన్, జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబు లు సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. యూనిటీ ఇన్ డైవర్సిటీ సభ్యులు కత్తి నెహ్రూ, విడిఐ జయరాజ్, డాక్టర్ జాఫర్, గిరి, సైదారావు తదితరులు రక్తదాతలకు పండ్లు పంపిణీ చేసి అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి

\మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరి మండలం నందనం గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను తేమ పేరుతో, మాచర్ రావడం లేదని 15 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మి నారాయణ గౌడ్, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు జక్క రాఘవేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నాగేల్లి గిరిజ రమేష్ గౌడ్, విఠల్ రెడ్డి, సాంబాంకరి వెంకటేష్, చింతల దేవేందర్ గౌడ్, కొండాపురం శ్రీనివాస్, మోలుగు నాగరాజు, చుక్క పద్మయ్య, ఉపసర్పంచ్ కాసాని శేఖర్ యాదవ్, రాసాల లింగ స్వామి యాదవ్, మధుసూదన్ రెడ్డి సురేష్ పాల్గొన్నారు

## బండి సంజయ్ దిష్టి బొమ్మ దగ్ధం



**ముద్ర, తుంగతుర్తి:** హైదరాబాద్ లో మైనర్ బాలిక నునమ్మించి మోసం చేసి లైంగిక వేధింపులకు గురి చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ను వెంటనే అరెస్ట్ చేయాలి అని డిమాండ్ చేస్తూ కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను తుంగతుర్తి పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆదివారం దగ్ధం చేశాయి ఈ సందర్భంగా మండల బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ వేధింపులకు గురి అయినటువంటి యువతి కి ప్రభుత్వం అన్ని విధాల న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఉన్న చాటు మాటు రాజకీయ సంబంధం తో కేంద్రమంత్రి బండి సంజయ్ కేసును నిరుగార్చాలని చూస్తున్నారని అన్నారు పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని నిందితుడిని చట్ట పరిధిలో శిక్షించాలని డిమాండు చేస్తున్నామనీ అన్నారు మైనర్ బాలిక కు న్యాయం జరిగే బిఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. ఈకార్య క్రమంలో మండల నాయకులు సోమేష్. రమేష్. లక్ష్మయ్య నాగమల్లు. వెంకటేష్ గోపగాని వెంకన్న లతీఫ్ చింతకుంట్ల సురేష్ కొల్లూరి మహేందర్. ఆకారపు భాస్కర్ పాల్గొన్నారు.

## అనర్హులకు వడ్డెర కార్పొరేషన్ బాధ్యతలు






**ముద్ర, యాదగిరిగుట్ట :** కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షదాయకమని, వడ్డెర హక్కుల సాధన కోసం పనీ చేయని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఏ మాత్రం కృషి చేయని వ్యక్తులకు చైర్మన్, వైస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం సమంజసం కాదని తెలంగాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కోడిదెల అంజయ్య అన్నారు. వడ్డెర కులస్తుల క్షేత్ర స్థాయి స్థితిగతుల పై అవగాహన లేని వ్యక్తులకు అవకాశం ఇవ్వడం వల్ల జాతి పురోగతి అనుకున్న స్థాయిలో జరగదన్నారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్టు సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వడ్డెర సంఘం పెద్దలు, ముఖ్యుల నుండి అభిప్రాయ సేకరణ జరపకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తమకు ఆవేదన కలిగించిం దన్నారు. గుంజ రేణుక, బత్తుల వెంకటేష్ బాధ్యతలు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం లాభం చేకూరదన్నారు. కాంగ్రెస్ నే నమ్ముకొని ముందుకు సాగుతున్న నిఖార్సైన వడ్డెరలకు అవకాశం దిశగా అడుగులు వేయాలని, తాజా నియామకం పై కాంగ్రెస్ పార్టీ పెద్దలు పునరాలోచించాలని సూచించారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ అధ్యక్షుడు పల్లపు. నగేష్, పల్లపు ప్రదీప్, శివరాత్రి నవీన్, సాయి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 11.05.2026
www.mudranews.in | @mudranews



**ఫ్యాటీ లివర్ వ్యాధిని అడ్డుకోవాలంటే:**

కొలెస్ట్రాల్ నియంత్రణ: శరీరంలో చెడు కొలె స్ట్రాల్ (LDL) తగ్గించు కోవడం వల్ల కాలే యంపై ఒత్తిడి తగ్గు తుంది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల కాలేయ వాపు తగ్గుతుంది.




# రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం

## -ధాన్యం కొనుగోళ్లపై సీఎం, మంత్రులకు పట్టింపు లేదు

### -ఎమ్మెల్యే హరీశ్ రావు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ధాన్యం కొనుగోళ్ల కోసం రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేయనున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ఆదివారం చేగుంట మండలం కర్నాల్ పల్లి వద్ద కొను గోలు కేంద్రాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి తో కలిసి మాజీ మంత్రి, బీఆ ర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలు తెలుసుకున్నారు. వానలకు తడిసిన వడ్లను పరిశీలించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మంట్లాడుతూ వడ్ల కొనుగోళ్లపై సీఎం, మంత్రులకు పట్టింపు లేదని ధ్వజమె త్తారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా రేవంత్ రెడ్డికి కనీస కని కరం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల లో విఫల మైందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారింద న్నారు. ఇక్కడ కేంద్రం ప్రారంభించి 25 రోజులైనా ఇప్పటివరకు కేవలం రెండే లారీ లు వచ్చాయన్నారు. పది రోజులకు ఒక లారీ వస్తే ఈ వడ్లన్నీ ఎప్పుడు కొనాలని ప్రశ్నిం చారు. వర్షాలకు ధాన్యం తడిస్తే మళ్లీ ఆరబె ట్టినా కొనలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంద న్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రామానికి వెళ్లినా రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇంతవరకు ధాన్యం కొనుగోళ్లపై ఒక్క రోజైనా కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టారా? మంత్రులతో ఒక్క మీటింగ్ అయి నా చేశారా అని ప్రశ్నించారు. ఢిల్లీకి వెళ్లి కప్పం కట్టడం తప్ప.. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతుల కష్టాలు ముఖ్యమంత్రికి, మంత్రులకు పట్టవా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలో ఇప్పటివరకు ఏ ఒక్క మంత్రి అయినా ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష చేయలేదన్నారు. ఏసీ రూముల్లో కూ ర్చుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఒకసారి పోలీసులను పక్కనపెట్టి రాష్ట్రంలో కొను గోలు కేంద్రాలు తిరిగితే రైతుల కన్నీళ్లు, కష్టాలు ఏంటో అర్థమవుతాయన్నారు. అధి కార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యక ర్తలు, ఆ పార్టీ సర్పంచ్ లే ధాన్యం కొనాలని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తు న్నారని తెలి పారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరి స్థితి ఎంత దయనీయంగా, దారుణంగా తయా రైందో అర్థం చేసుకోవాలన్నారు.

### మక్క రైతులకు రుపాయి రాలేదు

మ క్కలు, శనగలు, సన్ ఫ్లవర్ అమ్మిన రైతులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభమే కాలేదన్నారు. 35 రోజుల నుంచి సన్ ఫ్లవర్ కొనుగోళ్లు ఆగి పోయాయన్నారు. కుప్పల కింద ఆ పంటకు చెదలు పడుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదని విమర్శించారు. సివిల్ సప్లైస్ కార్పొ రేషన్ లో జరిగిన అవినీతి వల్లే నేడు అది దివాలా తీసిందని మండిపడ్డారు. ఆ సంస్థ ఎన్పిఏ కావడంతో బ్యాంకులు అప్పులివ్వడం లేదన్నారు. దొడ్డిదారిన కోఆపరేటివ్ బ్యాంకు నుంచి మార్క్ ఫెడ్ కు, అక్కడి నుంచి సివిల్ సప్లైస్ కు డబ్బులు మళ్లించారన్నారు. రేషన్ షాపుల్లో ఏళ్ల తరబడి నిల్వ ఉన్న సుమారు రూ. 500 కోట్ల విలువైన దొడ్డు బియ్యం పురుగులు పట్టి ముక్కిపోయాయన్నారు. ప్రభుత్వం మేల్కొని లారీలు పంపించి, కాం టాలు పెట్టి ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. లేనిచో తమ పార్టీ ఆధ్వర్యంలో కలె క్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## 80,411 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

### -కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో ఇప్పటివరకు 17,254 మంది రైతుల నుంచి 80,411 మెట్రిక్ టన్నుల ధా న్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ రైతులకు రూ. 86 కోట్లు చెల్లించినట్లు పేర్కొ న్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రా ల్లో నిల్వలు లేకుండా వెంటనే విల్లులకు తలించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వేగవంతంగా రవాణా చేసేం దుకు దిశానిర్దేశం చేశారు. కొనుగోలు అయిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలిం చుటకు ప్రత్యేక చర్యలు తీసు కోవాలన్నారు.

లారీలపైనే ఆధార పడకుండా, అవసర మైతే ఇతరాత్ర వాహనాల ద్వారా మిల్లు లకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రోజు వారీగా కేంద్రాల్లో గల నిల్వలు, మిల్లులకు తరలించిన వివరాల నివేదికలను సమ ర్పించాలని కొనుగోలు కేంద్ర నిర్వా హకు లను ఆదేశించారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అలసత్వం చేయవద్దని స్పష్టం చేశారు. గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల్లోని ప్రతి ధాన్యం గింజను మిల్లులకు తరలించే వరకు శ్రమించాలని అధికారులకు సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వివరాలు, మిల్లులకు రవాణా చేస్తున్న వివ రాలను సంబంధిత రిజిష్టర్లలో పక డ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు అకాల వర్షాలు కురుస్తునందున అధికా రులు, కొనుగోలు కేంద్రాల నిర్వహాకులు అప్పమత్తంగా ఉండాలన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల వేగం పెంచాలి

### -ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెం చాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సూచించారు. ఆదివారం మెదక్ మండలంలోని పాపన్నపేటలో ధాన్యం కొను గోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పరిశీ లించారు. కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్ల ర్లు ఇబ్బందులు పెడుతున్నారని స్థానిక నాయకులు, రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పం దించి పలువురు రైస్ మిల్లర్లతో ఫోన్లో మా ట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లుకు వచ్చిన వెంటనే ధాన్యాన్ని ఖాళీ చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని రైస్ మిల్ల ర్లకు సూచించారు. రైతులు అధైర్య పడవద్ద న్నారు. పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. అధికారులు ఎప్పటికపుడు పరిశీలించాలన్నారు. ఎమ్మెల్యే వెంట మెదక్ మున్సి పల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మండల నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీని వాస్, శ్రీకాంతప్ప, శ్రీనివాస్, హీరా లాల్, గౌస్ తదితరులు ఉన్నారు.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్తలు..**

# రత్నాకర్ రావు సేవలు మరువలేనివి



**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధిలో మాజీ మంత్రి జువ్వాడి రత్నా కర్ రావు సేవలు మరువలేనివని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ కోరు ట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు అన్నారు. పట్టణంలో ఆదివారం జువ్వాడి రత్నాకర్ రావుకు ఘన నివాళి అర్పించారు. ఆరో వర్ధంతి సందర్భంగా వెట ర్నరీ కళాశాల వద్ద గల జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహనికి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జు వ్వాడి నర్సింగరావు, పార్టీ సీనియర్ నాయకులు జు వ్వాడి కృష్ణారావు, శేఖర్ రావు పా ల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ రత్నాకర్ రావు కోరుట్ల నియో జకవర్గ ప్రజల హృదయాల్లో చిరస్మర ణీయులుగా నిలిచిపోయారని కొని యా డారు. రత్నాకర్ రావు హయాంలో కోరుట్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. వెటర్నరీ, పాలిటెక్నిక్ కళాశాల తీసుకు వచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. రత్నాకర్ రావు మంత్రిగా ఉన్న సమయంలో కోరుట్ల పట్ట ణానికి సుమారు 4,500 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు చేయించారని చెప్పారు. మాదాపూర్ కాలనీ, అర్బన్ కాలనీ, ఏసుకొని గుట్ట, అల్లమయ్య గుట్ట లాంటి కాలనీలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గడచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేవలం కోరుట్ల పట్టణంలో 80 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మాత్రమే నిర్మించారని విమర్శించారు.అవి కూడా వారికి అనుకూలంగా ఉన్నవారికి అప్పగించారే తప్ప, అర్హులకు ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కార్మికు లకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలా రపు లింబాద్రి, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొంతం రాజాం, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు నేమూరి భూ మయ్య, సర్పంచ్ లు పాల్గొన్నారు.

## రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సుల పాత్ర కీలకం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సుల పాత్ర కీలకమని శుశ్రు త హాస్పిటల్ వ్యవస్థాపకులు డా. మురళీకృష్ణ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ నర్సింగ్ డే సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శుశ్రుత ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బందిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ అనేది కేవలం ఉద్యోగం కాదు, మానవత్వానికి ప్రతీకగా నిలిచే గొప్ప సేవా ధర్మమని కొనియాడారు. రోగి బాధను తమ బాధగా భావిస్తూ రాత్రింబవళ్లు సేవలందించే నర్సులు నిజమైన సేవామూర్తులని అభివర్ణించారు. వైద్యులు సూచించిన చికిత్సను సమర్థంగా అమలు చేయడమే కాకుండా, రోగులకు ధైర్యం చెప్పి మానసిక బలాన్ని అందించడంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోహిత్ సాయి, రిచ్ చిల్డ్రన్స్, స్వేచ్ఛ, శ్వాస, అవిశాయి, మంజునాథ సాయిరాం ఆసుపత్రుల ప్రతినిధులతో పాటు, డా. శ్రీకాంత్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్యాగ బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ నరేందర్, అనుజ్ఞ, నవ్య, సాయి చరణి, స్పందన, లెనివియా, ఇమాన్యువల్, స్వామి, అజయ్, శ్రవణ్, హమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను తాకట్టు పెట్టొద్దు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** కార్పొరేట్ శక్తులకు కార్మికుల హక్కులను తాకట్టు పెట్టొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.పద్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద ఆదివారం కార్మిక వర్గ వ్యతిరేక లేబర్ కోడ్స్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన నిబంధనలు శ్రామికుల మెడలకు బిగించిన ఉరితాళ్లేనని ఆరోపించారు. ఎన్నికల వేళ మాయమాటలతో ప్రజలను వంచించిన పాలకులు, గద్దెనెక్కిన వెంటనే కార్పొరేట్ శక్తుల పాదాల చెంత కార్మిక హక్కులను తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ నశించేంత వరకు, కార్పొరేట్, కమ్యూనల్ దోపిడీ పాలన అంతమయ్యేంత వరకూ పోరాటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతాయన్నారు. దీనికి జరిగే పరిణామాలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం, షౌకత్, అజయ్, దుర్గ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకం




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని కలెక్టర్ కె. హైమావతి అన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి మాడ్రన్ బస్టాండ్ వరకు మొదటి దశ జన గణనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. చాలా సంవత్సరాల తర్వాత భారతదేశంలో జనగణన చేస్తున్నట్లు తెలిపారు. 2021లో జరగాల్సిన జనగణన కోవిడ్ కారణంగా నిర్వహించలేదన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి చేస్తున్న జన గణన లో ఇది 16వ సారి అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఇది మొదటి జనగణన అన్నారు. మొదటి సారి డిజిటల్ విధానంలో జనగణన నిర్వహస్తున్నట్లు తెలిపారు. స్వీయగణన అనే విధానం తొలిసారి ప్రవేశపెట్టి జనగణన ప్రక్రియలో నూతన అధ్యాయానికి నాంది పలికారన్నారు. మీ కుటుంబ వివరాలను స్వయంగా మీరే నమోదు చేసుకునే చేసుకునే అవకాశం స్వీయ గణన ద్వారా కల్పించారని తెలిపారు. ఇందులో 34 ప్రశ్నలు ఉన్నాయన్నారు. కేవలం ఐదు నిమిషాల్లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. స్వీయ గణన కోసం https://se.census.gov.in సైట్ లో మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. స్వీయగణన చేయడానికి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకే గడువు ఉందన్నారు. స్వీయ గణనలో పాల్గొని వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సోమ వారం నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించనున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డిఎస్పీడీఓ హవీద్, సెక్యూరిటీ అధికారి రామస్వామి, ఎంఈఓ లు, ఎన్యూమరేటరులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com